మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# ఆశలన్నీ యాత్ర పైనే

- రాహుల్‌గాంధీ యాత్రతో క్యాడర్ పెంచుకునేందుకు భారీ స్కెచ్
- పాలమూరు జిల్లాలో పూర్వ వైభవం కోసం కాంగ్రెస్ కసరత్తు
- రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో కార్యచరణకు రూపకల్పన
- ఎన్నికలకు ముందే ప్రజల్లోకి కాంగ్రెస్


(ఫైల్)

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** భారత్ జోడో పేరిట కాంగ్రెస్ యువ నాయకుడు రాహుల్‌గాంధి కన్యాకుమారి టు కాశ్మీర్ చేపట్టిన పాదయాత్ర పైనే కాంగ్రెస్ శ్రేణులు దృష్టి సారించాయి. క్యాడర్ పెంచుకునేందుకు ఇదే అవకాశంగా భావించి భారీ స్కెచ్ వేశారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌కు నాయకత్వం వహిస్తున్న టిపిసిసి అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సహా పలువురు నాయకులు ఈ జిల్లాకు చెందిన వారు కీలక పదవుల్లో ఉండడం వల్ల మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలో పార్టీ పటిష్టతకు రాహుల్ యాత్ర దోహదపడే విధంగా ప్రయత్నిస్తున్నారు. ఒకప్పుడు ఉమ్మడి జిల్లాలో 13 అసెంబ్లీ నియోజకవర్గాలు, రెండు పార్లమెంట్ స్థానాలను గెలుచుకుని అధికారంలో ఉన్న పరిస్థితులు ఈసారి వచ్చేలా పూర్వ వైభవం కోసం గ్రామ, పట్టణ, జిల్లా స్థాయిలో నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్ చీఫ్ రేవంత్‌రెడ్డి డైరెక్షన్‌లో ఇందుకు సంబంధించి కార్యాచరణకు రూపకల్పన చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో వివిధ సెగ్మెంట్లలో పార్టీ పరిస్థితి బలబలాలపై సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ జిల్లాకు చెందిన ప్రముఖ నాయకులైన డా. మల్లురవి, డా.వంశీచంద్‌రెడ్డి, సంపత్‌కుమార్, డా.చిన్నారెడ్డి తదితర నాయకులు మహబూబ్‌నగర్ జిల్లా మీదుగా పాదయాత్ర నిర్వహిస్తే బాగుంటుందని అధిష్టానంపై ఒత్తిడి పెంచి రాహుల్ పాదయాత్రను ఉమ్మడి జిల్లా మీదుగా తీసుకెళ్లేలా ప్రయత్నిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం దాటిన తర్వాత తెలంగాణ పరిధి ప్రారంభం అయ్యే మక్తల్ నియోజకవర్గం నుండి మొదలుకొని దేవరకద్ర, మహబూబ్‌నగర్, జడ్చర్ల,షాద్‌నగర్‌ల మీదుగా శంషాబాద్ వరకు రాహుల్ పాదయాత్ర జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. అయితే రాహుల్ పాదయాత్రలో భాగంగా నిర్వహించే బహిరంగ సభలు మాత్రం కొన్ని ప్రాంతాలకే అనుమతి ఉండడం వల్ల ఇందులో పూర్వపు జిల్లా మహబూబ్‌నగర్‌కు అవకాశం ఇవ్వాలని ఇక్కడి నాయకులు పట్టుబడుతున్నారు. ఫలితంగా మహబూబ్‌నగర్‌లో బహిరంగ సభ నిర్వహించి విజయవంతం చేయాలని కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆ విధంగా చర్యలు తీసుకుంటున్నారు. కాంగ్రెస్ క్యాడర్ బలంగా ఉన్న ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలను, ప్రజలను తరలించి బహిరంగ సభలను విజయవంతం చేయాలని ఇప్పటినుంచి కసరత్తు చేస్తున్నారు. మహబూబ్‌నగర్ డిసిసి అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్, నారాయణపేట డిసిసి అధ్యక్షుడు వాకిటి శ్రీహరి, గద్వాల డిసిసి అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి, వనపర్తి డిసిసి అధ్యక్షుడు శంకర ప్రసాద్, నాగర్‌కర్నూల్ డిసిసి అధ్యక్షుడు డా. వంశీకృష్ణతో పాటు మాజీ ఎంపిలు,ఎమ్మెల్యేలు, మంత్రులు,ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఎవరి నియోజకవర్గాల్లో వారుబాధ్యతను తీసుకున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.ఇప్పటికే కాంగ్రెస్ నుండి విడిపోయిన నేతలను సొంత గూటికి చేర్చుకునే ప్రయత్నంలో భాగంగారాష్ట్ర నాయకత్వం దృష్టి సారించింది. ఒకప్పుడు మంత్రిగా ఒక వెలుగు వెలిగిన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావును తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి తీసుకునే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. టిఆర్‌ఎస్ అధినాయకులతో టచ్‌లో ఉన్నప్పటికిని గతఎన్నికల్లో కొల్లాపూర్ నియోజకవర్గం నుండి టిఆర్‌ఎస్ తిరుగుబాటు అభ్యర్థిగా పోటీచేసి సత్తా చాటుకున్న జూపల్లి కృష్ణారావు ప్రస్తుతం తటస్తంగా ఉన్నారు. రేవంత్‌రెడ్డి రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన తర్వాత మారిన రాజకీయ సమీకరణల నేపథ్యంలో జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లోకి రావడం ఖాయమని ప్రచారం జోరందుకుంది. ఒక్క జూపల్లే కాకుండా ఉమ్మ డి జిల్లాలో టిఆర్‌ఎస్, బిజెపి పార్టీల్లో చేరిన అప్పటి కాంగ్రెస్ నాయకులను కూడా తిరిగి రప్పించి ఉమ్మడి జిల్లాలో ఈ సారి కాంగ్రెస్ సత్తా చాటేందుకు సమిష్టి ప్రయత్నం చేస్తున్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందే ప్రజల్లోకి వెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీకి రాహుల్ పాద యాత్ర ఒక చక్కటి అవకాశంగా పార్టీ నాయకులు, పరిశీలకులు భావిస్తున్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**● ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలి: గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి**

**గద్వాల సెప్టెంబర్13 ప్రభాతవార్త:** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి వార్డు తిరుగుతూ రోగులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో డాక్టర్లు వైద్యం ఏలా చేస్తున్నారని వైద్యానికి వేసిఉండాల్సిన సమయం ఎంత పడుతుందని మందులు బయటకు వ్రాసి ఇస్తున్నారని పలు రకాలైన ప్రశ్నలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఓపి వార్డు, డయాలసిస్, ఐసియూలతోపాటు లేబర్ వార్డును పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని అందులో రోగి ఫోన్‌నెంబర్‌ను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. పరిశుభ్రత విషయంలో ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు.అనంతరం ఆసుపత్రిలో చిన్న పిల్లల వార్డును వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ఆసుపత్రిలో అత్యవసరమైన వైద్యానికి మందులు ఉన్నాయా అని ఆరాతీశారు. ఆరోగ్యశ్రీ కింద కేసులు నమోదు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.అదేవిధంగా ఆసుపత్రిలో ప్రసావాల మరింత పెంచాలని అందుకు డాక్టర్లు నిబద్దతతో పనిచేయా లని ఆదేశించారు. అన్ని వైద్యా సేవలు ఆసుపత్రిలో అం దించగలిగేలా సిద్దంగా ఉండాలని కొరారు. ఆసుపత్రికి కావాల్సిన సదుపాయాలు, అత్యవసర పరికారాలు మందుల కొనుగోలుకు పూర్తి నివేధిక ఇవ్వాలని ఆదేశించారు. బయె మెట్రిక్ ద్వారా ప్రతి సిబ్బంది సమయానికి హాజరు కావా లని కలెక్టర్ తెలిపారు.రక్త పరీక్షలు ఆసుపత్రిలో నిర్వహిం చాలని బయట వారు వచ్చి శాంపిల్ తీకెళ్లరాదని హెచ్చరించారు. సదరం క్యాంపులు నిర్వహించే ముందు దివాంగుల వివరాలు కంప్యూటర్‌లో నమోదు చేసివారికి పరీక్ష అనంతరం డాక్టర్ సంతకంతో సర్టిఫికెట్‌ను అందజేయాలని ఆదేశించారు. గర్భిణీస్త్రీలకు కూర్చోడానికి కుర్చిలు వేయించాలని వారు ఇబ్బందులు పడకుండాకలర్ టోకన్లు అందజే యాలని కలెక్టర్ సూచించారు.ఐసియూ, ఎస్‌ఎన్‌సి ఆక్సిజన్ పైపులైన్ నుండి మెయిన్‌పాయింట్‌కు పనులు పెండింగ్ ఉన్నాయని వైద్యా ఆరోగ్యశాఖ అధికారి కలెక్టర్ దృష్టికి తీసు కురాగా పది రోజుల్లో పనులన్ని పూర్తి చేయించాలని ఈఈ జయపాల్‌రెడ్డికి ఆదేశించారు. ఈకార్యక్రమంలోడాక్టర్లు శోభారాణి, వృషాలీని, క్వాలిటి మేనేజర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.


ఆసుపత్రిలో బెడ్డుపై ఉన్న మహిళను వివరాలు అడిగి తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ వల్లూర్ క్రాంతి

# పనుల నాణ్యతలో రాజీపడొద్దు

**● మన ఊరు- మన బడి పనులను వేగంగా పూర్తి చేయండి: నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్**

**నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలో మన ఊరు మనబడి కార్యక్రమం కింద మొదటి విడతగా చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన ఊరు - మన బడి పనులను ఆయా ఇంజనీరింగ్ శాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధతో త్వరగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పనుల జాప్యంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా పనులకు సంబంధించి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఆయా ఏజెన్సీలతో సమన్వయం చేసుకుని పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఈఈలను ఆదేశించారు. ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో మొదటి విడత ఎంపికైన పాఠశాలలను తనిఖీ చేసి ప్రతి పాఠశాలలో 30 మంది విద్యార్థుల నిష్పత్తి ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక్కో తరగతి గది ఉండేలా నివేదికలు తయారు చేసి రేపు సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 290 పాఠశాలలను మొదటి విడతలో ఎంపిక చేశామన్నారు. ఇప్పటికే 272 పాఠశాలలకు పరిపాలనాపరమైన అనుమతులను ఇచ్చామన్నారు. ఇందులో రూ. 30 లక్షలలోపు అంచనా గల 66 పాఠశాలలు ఉన్నాయని, వాటిని అన్నింటిని టెండర్లు పూర్తిచేసి పాఠశాలలు గ్రౌండింగ్ పూర్తి చేయాలని పేర్కొన్నారు. గ్రౌండ్ అయిన పాఠశాలలకు 15 శాతం నిధులను పాఠశాల నిర్వహణ కమిటిల ఖాతాలకు బదలాయించామని, ఇప్పటివరకు 4 కోట్ల 11 లక్షల రూపాయలు విడుదల చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. ఫండ్ ట్రాన్స్‌ఫార్మర్ ఆర్డర్‌లకు నమోదు చేసుకుంటే రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, నిధులకు ఎలాంటి కొరత లేదని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. టెండర్‌కు వెళ్లాల్సిన పాఠశాలల పనులను వారం రోజుల్లో టెండర్ ప్రక్రియను పూర్తిచేసి, సంబంధిత పాంశాలల్లో పనులు వేగవంతం చేయాలని సూచించారు. మన ఊరు మనబడి కార్యక్రమంలో చేసే ప్రతి పనికి సరైన నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, నాణ్యత విషయంలో రాజీ పడవద్దన్నారు. అన్ని పనులకు సంబంధించి వచ్చే వారంలోగా పురోగతి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆర్‌అండ్‌బి ఏఈ సంపత్ కొల్లాపూర్ మండలంలోని పనుల పర్యవేక్షణ బాధ్యతలను తీసుకోని కారణంగా అతని జీతాన్ని నిలపుదల చేయాలని డిటిఒకు లెటర్ రాయాలని ఆదేశించారు. మండలాల వారిగా పురోగతి పనులను సమీక్షించారు. ఈ సమీక్ష సమావేశంలోఅదనపు కలెక్టర్ మనుచౌదరి, ఈఈలు దామోదర్ రావు, రామచంద్రరావు, డిప్యూటి ఈఈలు దుర్గాప్రసాద్, రమాదేవి, ప్రతాప్, సెక్టోరియల్ అధికారి బరపటి వెంకటయ్య, ఈడిఎం నరేష్, టెక్నికల్ అసిస్టెంట్లు రఘు, సాయి, మండలాల విద్యాధికారులు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి. ఉదయ్‌కుమార్

## పెండింగ్‌లో ఉన్న భూసేకరణను తక్షణం పూర్తి చేయాలి

**● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు**

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద పునరావాస కేంద్రాలలో పెండింగ్‌లో ఉన్న అవార్డులను వచ్చే మంగళవారం నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కలెక్టర్ ఎస్. వెంకట్రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన వివిధ ప్రాజెక్టుల కింద భూసేకరణపై ఇరిగేషన్ అధికారులు, రెవెన్యూ అధికారులతో విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద పునరావాస కేంద్రాలకు సంబంధించి రెండు అవార్డు స్టేజీలో ఉన్నాయని అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, ఆయన పై విధంగా స్పందించారు. రైల్వే ప్రాజెక్టుల కింద చేపట్టిన పేరూర్ రైల్వే స్టేషన్ భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణను తక్షణం పూర్తి చేయాలన్నారు. అదేవిధంగా కోస్గి - చించోలి రహదారికి సంబంధించిన ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తయినట్లు అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పిఎన్ ప్రతిపాదనలు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు.భూసేకరణ సందర్భంగా ఉద్యాన మొక్కలు, అటవి భూములకు సంబంధించిన అంశాలు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, స్పెషల్ కలెక్టర్ పద్మశ్రీ, ఆర్డీఓ అనిల్‌కుమార్, సంబంధిత మండలాల తహసిల్దార్లు, ఇరిగేషన్ ప్రాజక్టుల ఇంజనీర్లు తదితరులు విడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.


విడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

## 16 నుండి 18 వరకు జాతీయ సమైక్యత వజ్రోత్సవాలు

**● నారాయణపేట జిల్లా కలెక్టర్ హరిచందన**

**నారాయణపేట,సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** సెప్టెంబరు 16వ తేదీ నుండి 18 వరకు నిర్వహించనున్న తెలంగాణ జాతీయ సమైక్యత వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ప్రణాళికలు చేయాలని జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశపు హాల్లో జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్, జిల్లా అధికారులతో సమైక్యత వజ్రోత్సవాల నిర్వహణపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమాల్లో భాగంగా 16వ తేదీ జిల్లాలోని రెండు మున్సిపాలిటీల్లో భారీ ర్యాలీ అనంతరం సభ నిర్వహించి వచ్చిన జనాలకు భోజనం పెట్టించి పంపించడం జరుగుతుందన్నారు. ఈ ర్యాలీ నారాయణపేటలో క్రీడా మైదానం నుండి ప్రారంభమై అంబేద్కర్ సర్కిల్, క్యాంపు కార్యాలయం మీదుగా శెట్టి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడే బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ర్యాలీకి వచ్చిన ప్రతి ఒక్కరికి శెట్టి ఫంక్షన్ హాల్‌లో భోజనం చేయించి క్షేమంగా పంపించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ర్యాలీ సజావుగా నిర్వహించడంతో పాటు భోజనాలు, తాగునీరు వంటి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. దాదాపు 10 వేల జాతీయ పతాకాలను ర్యాలీలో ఇవ్వాల్సి ఉంటుందని, పతాకాలకు కర్రలు సిద్ధం చేసుకోవాలన్నారు. వాటిని ఎక్కడ కింద పడేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మక్తల్ నియోజకవర్గ పరిధిలో మక్తల్ జూనియర్ కళాశాల నుండి ద్వారక ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ ఉంటుందని, భోజనాలు అక్కడే ఉంటాయన్నారు. ఈ ర్యాలీకి 8వ తరగతి ఆపైన విద్యార్థులను మాత్రమే ర్యాలీకి తీసుకోవాలని అంతకన్నా చిన్న వయస్సు విద్యార్థులను పిలవవద్దని సూచించారు.స్వయం సహాయక సంఘాలు,మహిళా సంఘాల ప్రతినిధులు ర్యాలీలో పాల్గొనే విధంగా చూడాలన్నారు. ర్యాలీకి 108, ప్రాథమిక చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలని వైద్యాధికారిని ఆదేశించారు. 17వ తేదీన పరేడ్ మైదానంలో జాతీయ పతాకావిష్కరణ కార్యక్రమం ఉంటుందని అదేరోజు ఉదయం జిల్లాలోని గిరిజన ప్రజా ప్రతినిధులు, గిరిజన ఉద్యోగులు, ఆసక్తి ఉన్న గిరిజన మహిళా సంఘాల ప్రతినిధులను బస్సుల ద్వారా హైద్రాబాద్ ఎన్‌టిఆర్ గార్డెన్‌లో రాష్ట్ర ముఖ్యమంత్రి పాల్గొనే కార్యక్రమానికి పంపించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. మండలాలు, మున్సిపాలిటీలు వారిగా దాదాపు 20 బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి బస్సుకు ఒక కానిస్టేబుల్, మండల అభివృద్ధి అధికారి ఉంటారని ఆదేశించారు. వారికి అవసరమైన సదుపాయాలు మంచినీరు, అల్పాహారం, మధ్యాహ్నం, సాయంత్రం భోజనాలు అందించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని అధికారులకు బాధ్యతలను అప్పగించారు. ఉదయం 8 గం.లకు ఆయా ప్రాంతాల నుండి బస్సులు బయలుదేరుతాయని ఉదయం 5 గం.ల వరకు బస్సులను మండలాలు, మున్సిపాలిటీలకు పంపించాలని ఆర్టీసి డిపో మేనేజర్‌ను ఆదేశించారు. 18వ తేదీన స్థానిక అంజనా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. 15వ తేదీ నుండి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలపై త్రివర్ణ రంగు విద్యుత్ లైట్లు పెట్టించి అందంగా అలంకరించాలని ఆదేశించారు. ఈ వజ్రోత్సవాల్లో ప్రజాప్రతినిధులను, ప్రజలను పెద్ద మొత్తంలోభాగస్వాములను చేయాలని సూచించారు. కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఇప్పటికే అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఎస్పీ ఎన్. వెంకటేశ్వర్లు,అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ కె. చంద్రారెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ, పద్మజారెడ్డి, ఆర్డీఓ రాంచందర్‌నాయక్, జిల్లా అధికారులు, డీఎస్పీ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై దృష్టి సారించాలి

**మహబూబ్‌నగర్,సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** ఆస్పత్రిలోని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రాంకిషన్ అన్నారు. ఆస్పత్రిలో ఇన్ఫెక్షన్స్ కంట్రోల్‌పై మంగళవారం వైద్యులు, ఇతర సిబ్బందితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో ఇన్ఫెక్షన్ రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హైరిస్క్ ఏరియాలైన పీఓడబ్ల్యూ, ఐసీయూ, సీఓటీ,ఓటీఆర్ఐసీయూ వంటి వాటిపై శ్రద్ధ చూపాలన్నారు. బయోమెడికల్ వేస్టేజ్ సెగ్రిగేషన్, బయో మెడికల్ వేస్ట్‌ను ఎప్పటికప్పుడు సేకరించడం వల్ల ఇన్ఫెక్షన్ నివారించవచ్చున్నారు. హైరిస్క్ ఏరియాలో ప్రతి 3 నెలలకోసారి స్వాప్‌కల్చర్ నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా 22 మంది సభ్యులతో కూడిన ఇన్ఫెక్షన్ ప్రివెన్షన్ కంట్రోలన కమిటి ఏర్పాటు చేశారు. సమావేశంలో డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ జీవన్, కో ఆర్డినేటర్ రమాదేవి, కమిటి కన్వీనర్ అసోసియేట్‌ప్రొఫెసర్ సయ్యద్ ఫాహెద్, అమరావతి, సురేష్ పాల్గొన్నారు.

# బాల్య వివాహాలను అరికట్టాలి

**● జడ్పీ చైర్మన్ ఆర్.లోక్‌నాథ్‌రెడ్డి**

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** బాల్య వివాహాలు జరగకుండా గ్రామాలలో అధికారులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఆర్.లోక్‌నాథన రెడ్డి సూచించారు. మంగళవారం ఐడిఓసీ సమావేశ మందిరంలో మహిళ, శిశు, వికలాంగుల, వయోవృద్దుల శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కులు- చట్టాలులు పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో జిల్లా అదనపు కలెక్టర్ ఆశీశ్ సంగ్వాన్ తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల అనేక అనర్థాలు జరుగుతాయని, ఆడపిల్లలకు(18)సంవత్సరాలు నిండిన తర్వాత వివాహం జరిపించాలని,14 సంవత్సరాల లోపు బాల బాలికలను పనిలో పెట్టుకోరాదని,వారిని గుర్తించి బడిలో చేర్పించాలని ఆయన అన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు, బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారం అందజేయాలని ఆయన సూచించారు. పిల్లల శారీరక, మానసిక, ఆరోగ్యకరమైన ఎదుగుదల పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని ఆయన తెలిపారు. గ్రామాలలో ప్రజలకు విస్తృత ప్రచారం చేయాలని ఆయన సూచించారు. డిడబ్ల్యూఓ పుష్పలత మాట్లాడుతూ స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ద్వారా 0-6సం.ల చిన్నారులకు ఉచిత విద్యను, మైనర్ బాల బాలికలకు ఆపతలో ఉన్న స్త్రీలకు సచ కేంద్రం ద్వారా సేవలందిస్తున్నట్లు ఆమె తెలిపారు. దివ్యాంగులు, వయోవృద్దుల సంక్షేమ కార్యక్రమాలను అమలు పరుస్తున్నట్లు 24 గంటల సేవలు అందుబాటులో ఉన్నట్లు ఆమె తెలిపారు. చిన్న పిల్లలకు గర్భిణీలకు, బాలింతలకు,పౌష్టికాహారాన్ని అందజేస్తున్నట్లు ఆమె సూచించారు. గ్రామ సర్పంచులు, అంగన్వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలు, ఏఎన్ఎంలు, మహిళా సంఘాల సభ్యులు, స్వచ్చంద సంస్థల సభ్యులు, పోలీసు, రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయితీ కార్యదర్శులు ప్రజలలో అవగాహన కల్పించి బాలల పరిరక్షణకు కృషి చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలోడిఎంహెచ్ఓ రవిశంకర్, డిఆర్‌డిఓ నరసింహులు, డిపిఓ సురేష్, ఎసిఎల్‌బి వైస్ చైర్మెన్, జడ్పీటీసీ లు, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు, ఐసిడిఎస్ సిబ్బంది, జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వల చేస్తున్న దృశ్యం

## సంక్షేమ పథకాలు అందించడంలో దేశంలోనే తెలంగాణ ఆదర్శం

**-డీల్లిలో అధికారి ప్రతినిధి, మాజీ ఎంపీ మందా జగన్నాథం**

**ఇటిక్యాల సెప్టెంబర్13 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో 8 ఏళ్లుగా అన్ని వర్గాల వారికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఇలాంటి సంక్షేమ పథకాలు అందించడంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా నిలిచిందని డిల్లీలో అధికార ప్రతినిధి మాజీ మందా జగన్నాథం అన్నారు. మంగళవారం మండల పరిది లోని ఉదండాపురం గ్రామంలో మంజూరైన 92 మంది పింఛన్ల లబ్దిదారులకు మాజీ ఎంపీ మందా జగన్నాథం, అలంపూర్ టిఆర్ ఎస్ పార్టీ మాజీ ఇంచార్జి మందా శ్రీనాథ్, సర్పంచు అయ్యమ్మ, ఎంపిటిసి కేశన్న, పంచాయితీ కార్యదర్శి సరస్వతి, ఉపసర్పంచు శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పింఛన్ దారులకు మంజూరు దృవ పత్రాలు, గుర్తింపు కార్డులను పంపిణి చేశారు. ఈసందర్భంగా మాజీ ఎంపి మందా జగన్నాథం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అర్హులైన వారికి ముఖ్యమంత్రి కేసిఆర్ వృద్యాప్య, వికలాంగులకు, వితంతువులకు గీతకార్మికులు, 57 సంవత్సరాలు దాటిన వారందరికి ప్రభుత్వం పింఛన్లను మంజూరు చేసిందన్నారు. ఇంకా కూడా అర్హులైన ఉంటే వారికి కూడా పింఛన్లును అందిస్తుందన్నారు. అంతేకాక తెలంగాణ రాష్ట్రంలో పేద ప్రజలకు కళ్యాణలక్ష్మి, షాధి ముబారక్, రైతబంధు, రైతబీమా వంటి అనేక రకాల సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల నాటికి ముఖ్యమంత్రి కేసిఆర్‌దేశప్రజల బాగుకోసం తెలంగాణ తరహాలో సంక్షేమ పథకాలనుదేశమంతటా అమలు చేసేందుకు ముఖ్యమంత్రి కేసిఆర్ అడుగులు వేస్తున్నారని అన్నారు. తెలంగాణ అన్ని వర్గాల ప్రజలు ముఖ్యమంత్రి కేసిఆర్ వెంట అండగా ఉండాలని సూచిం చారు. ఈసందర్భంగాతాజా మాజీసర్పంచు నడిపన్నకు ప్రస్తుత సర్పంచు అయ్యమ్మ ఓల్డ్‌ఏజీ పించన్ మంజూరు దృవపత్రం, గుర్తుంపు కార్డును సర్పంచు అయ్యమ్మ పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు దానం, తిరుపతిరెడ్డి, బలరాముడు, ఏకాంత్ తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు పింఛన్ల మంజూరు ధృవపత్రాలను పంపిణీ చేస్తున్న డిల్లీ అధికారి ప్రతినిధి, మాజీ ఎంపి మందా జగన్నాథం

## ప్రమాద బాధితుడికి ఆర్థిక సహాయం

**కల్వకుర్తి, సెప్టెంబర్13, ప్రభాతవార్త:** కల్వకుర్తి మండలం మార్చాల గ్రామానికి చెందిన అంజద్ గత కొన్ని రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అంజద్ ఆర్థిక పరిస్థితిని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో మానవతా ధృక్పథంతో స్పందించిన ఎన్ఆర్ఐ తక్షణ సహాయంగా రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని సమకూర్చారు. మంగళవారం ప్రమాద బాధితుడిని ఫౌండేషన్ సభ్యులు పరామర్శించి ఎన్ఆర్ఐ సమకూర్చిన రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో సభ్యులు ఆవ గణేష్, తిరుపతి, గొరిగే రామకృష్ణ, ఉడల మల్లేష్, సాయి, రామకృష్ణ, మైనార్టీ నాయకులు ఖాజామైనుద్ధిన్, ఇర్ఫాన్ సిద్ధిచ, మహమూద్ తదితరులు ఉన్నారు.

## సీఎం సహాయ నిధి చెక్కు అందజేత


సీఎం సహాయ నిధి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

**కల్వకుర్తి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గంలోని మాడ్గుల మండలం కలకొండ గ్రామానికి చెందిన లలితకు మంజూరైన రూ.58వేలు, చారకొండ మండలం ఎర్రవల్లి గ్రామానికి చెందిన ఎల్.శ్రీనుకు మంజూరైన రూ.18వేలు, ఎన్.రాములుకు మంజూరైన రూ.36వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి తన నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజల పాలిటవరమన్నారు. అనారోగ్యాలతో బాధపడుతున్న వారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకొని ఆర్థిక సహాయం కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు ధరఖాస్తు చేసుకునే అవకాశాన్ని సీఎం కల్పించారని, సీఎం రిలీఫ్ ఫండ్ వల్ల ఎంతో మంది నిరుపేదలు లబ్ధి పొందుతున్నారు. అదే విధంగా ఆమనగల్లు మండల కేంద్రంలో సెప్టెంబర్ 17న నిర్వహించే విశ్వకర్మ యజ్ఞానికి హాజరు కావాలని విశ్వకర్మ సభ్యులు ఎమ్మెల్సీని కలిసి ఆహ్వానించారు. సందర్భంగా కార్యక్రమంలో జంయ్య, గోళి సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## మండలంలో వైఎస్ షర్మిల పాదయాత్ర

**మూసాపేట, సెప్టెంబరు 13 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వైఎస్ షర్మిల చేస్తున్న ప్రజాప్రస్థానం పాదయాత్ర 151వ రోజు సైతం దేవరకద్ర నియోజకవర్గంలో మూసపేట మండలాల పరిధిలోని చెన్నంపల్లి, దాసరిపల్లి, వేముల, తున్కిపూర్, మూసపేట గ్రామాల మీదుగా షర్మిల పాదయాత్ర చేశారు. ఆమెకు స్థానికులు అడుగడుగునా ఘనంగా స్వాగతం పలికారు. కెసిఆర్ వైఫల్యాలను అధినేత్రి దృష్టికి తీసుకువచ్చారు. రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మరిచారని, దీంతో బ్యాంకుల్లో వడ్డీలు కట్టలేకపోతున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేయగా, అర్హులకు పెన్షన్లు పూర్తి స్థాయిలో అందడం లేదని, 90 ఏళ్లు వచ్చినా నాకు పెన్షన్ ఇవ్వరంటా అంటూ ఒక వృద్ధురాలు షర్మిల వద్ద తమ గోడు వెల్లబోసుకుంది. ప్రజల సంక్షేమం కోసమే వైఎస్ఆర్ పార్టీ పెట్టామని, అధికారమిస్తే ఇంట్లో ఎంతమంది పెన్షన్‌కు అర్హులుంటారో అందరికి మూడువేలు తక్కువ కాకుండా పెన్షన్ ఇస్తామని, మహిళ పేరుమీద పక్కా ఇళ్లు కట్టించడంతో పాటు మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తామంటూ వైఎస్ షర్మిల హామీ ఇచ్చారు. మంగళవారం సాయంత్రం జానంపేట గ్రామంలో మాట - ముచ్చట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ షర్మిల మాట్లాడుతూ గ్రామంలో వైఎస్ఆర్ పథకాలతో పేద ప్రజలకు జీవితాంతం ఎప్పుడు ఉపయోగకరంగా ఉంటాయని ఆ పథకాలనే ఇప్పుడు కెసిఆర్ తప్పుదోవ పట్టిస్తున్నారని కెసిఆర్ మాట నిలబెట్టుకుని పేద ప్రజలకు వైఎస్ఆర్ సంక్షేమ పథకాలను మళ్లీ నిర్వహించి ప్రజలకు మేలు చేసే విధంగా ప్రభుత్వం అందుబాటులో ఉండాలని సూచించారు. జానంపేటలోనే రాత్రికి బసచేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ పార్టీ నియోజకవర్గ ఇంఛార్జి సర్వస్‌రెడ్డి, మండలాల వైఎస్ఆర్ కార్యకర్తలు, గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఔదార్యం



తోటి మిత్రుడికి ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

**చిన్నచింతకుంట, సెప్టెంబరు13 ప్రభాతవార్త:** తమతో పాటు చదువుకున్న తోటి స్నేహితుడికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని తెలిసి ఆర్థిక సహాయం అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్న పూర్వ విద్యార్థులు. వివరాల్లోకి వెళ్తే చిన్నచింతకుంట మండల కేంద్రంలో 1978-79 విద్యా సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన పూర్వ విద్యార్థులు తమతో చదువుకున్న తోటి స్నేహితుడు వడ్డెమాన్‌కు చెందిన ఎక్బాల్ ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడని తెలిసి తోటి స్నేహితులుగోవర్ధన్, శ్రీనివాసరావు, సామ్రాజ్యలక్ష్మి, వరలక్ష్మి, సాయిలు, భాస్కర్‌రెడ్డి, కేశవర్ధన్‌రెడ్డి, నజీర్ అహ్మద్, యోనా, రాములు, అశ్వక్, మునావర్, బాల్‌రాజ్‌లు కలిసి రూ.22 వేలు జమచేసి మంగళవారం ఎక్బాల్‌కు గోవర్ధన్, సాయిలు కలిసి అందజేశారు. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న స్నేహితుడికి తోటి మిత్రులు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచినందుకు పలువురు ప్రశంసించారు.

## తెలంగాణ విమోచనను ఘనంగా నిర్వహించాలి



**పెద్దమందడి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** సెప్టెంబర్ 17 1948 న తెలంగాణాకు స్వతంత్ర్యం వచ్చిందని తెలంగాణ లో భారీ ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 13న భారత ఆర్మీని అప్పటి ప్రధానమంత్రి సర్దార్ వల్లభ్ భాయి పటేల్ హైదరాబాద్ ను ముట్టడించి మూడు రోజుల్లో రజాకర్ల నుండి హైదరాబాద్ కు విముక్తి చేసి భారత ప్రభుత్వం విలీనం చేసిన గొప్ప నాయకుడు సర్దార్ వల్లభ్ భాయి పటేల్ అని అన్నారు, ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతో సెప్టెంబర్ 17 భాగ్యనగరం లో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలలో కేంద్ర హోంశాఖ మంత్రా అమిత్‌షా పాల్గొంటారని ఆయన తెలిపారు. సర్దార్ వల్లభ్ భాయి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకాపు మాధవరెడ్డి, కొత్తకోట రూరల్ మండల అధ్యక్షుడు కోటీశ్వర్ రెడ్డి, మండలబీజేపీ అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.

## జాతీయ పోటీలకు రెండు ఆవిష్కరణలు ఎన్నిక

**మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** ఢిల్లీలో నేడు 14వ తేదీ నుండి 16వ తేదీ వరకు జరగనున్న నేషనల్ లెవల్ ఇన్స్పైర్ అవార్డుల పోటీలలో జాతీయ స్థాయికి మహబూబ్‌నగర్ జిల్లా నుండి రెండు ప్రాజెక్టులు ఎన్నిక కావడం జరిగిందని డిఓ రవిందర్ ఒక ప్రకటనలో తెలిపారు. హన్వాడ మండలం మహాత్మా జ్యోతిభాపులే విద్యాలయానికి చెందిన తాటి భావన అనే విద్యార్థిని లైటింగ్ మ్యాన్ హోల్ అనే ఆవిష్కరణ ద్వారా జాతీయ స్థాయికి ఎన్నిక కావడం జరిగింది. అలాగే అడ్డాకల్ మండలం తిమ్మాయిపల్లి తండా యుపిఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి పి. మహేష్ అనే విద్యార్థి తయారు చేసిన స్మోక్ లెస్ చిమ్ని అనే ఆవిష్కరణ ద్వారా జాతీయ స్థాయికి ఎన్నిక కావడం జరిగింది. ఈ ఇద్దరు విద్యార్థులు నేటినుండి మూడు రోజులపాటు ఢిల్లీలో జరగబోయే జాతీయస్థాయి ఇన్స్పైర్ పోటీలలో పాల్గొంటున్నారు. ఈ రెండు ప్రాజెక్టులు జాతీయ స్థాయికి ఎన్నిక కావడం మన జిల్లాకు గర్వకారణమని ఈ సందర్భంగా డిఓ రవిందర్ తెలియజేస్తూ వినూత్నమైన ఆవిష్కరణలతో జాతీయస్థాయికి ఎన్నికకాబడిన విద్యార్థులను జిల్లాసైన్స్ అధికారిబి.శ్రీనివాసులును డిఓ అభినందించారు.

## బెస్ట్ స్కూల్ అవైలబుల్ పాఠశాల 1వ తరగతి ప్రవేశానికి ఎస్సీ విద్యార్థుల నుండి దరఖాస్తుల స్వీకరణ

**వనపర్తి ప్రతినిధి, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** 2022-23 సం.నికి బెస్ట్ అవైల్‌బుల్ పాఠశాల 1వ తరగతి ప్రవేశానికి ఎస్‌సి కులానికి చెందిన విద్యార్థుల నుండి ఈనెల 15వ తేదీ నుండి 22వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిని నుషిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు దరఖాస్తులు చేసుకొనుటకు వనపర్తి జిల్లా వాసులై ఉండాలని మీ సేవ ద్వారా పొందిన కులము, ఆదాయము, స్థానిక ధృవ పత్రాలను, జనన ధృవీకరణ పత్రం జమ చేయాలని ఆమె సూచించారు. 1వ తరగతిలో ప్రవేహం కొరకు తేదీ 16/06/2016 నుండి తేదీ 31/05/2017 మధ్య జన్మించిన వారు అయి ఉండాలని, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఫోటోలను జత చేయవలసిందిగా ఆమె తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల తల్లిదండ్రులకు వార్షికాదాయం రూ.1లక్ష రూ.50 వేలు, పట్టణ ప్రాంతాల విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2లక్షల లోపు ఉండవలెనని కుటుంబంలో ఒకరికి మాత్రమే అవకాశం కలదని ఆమె సూచించారు. గతంలో ఈ పథకం ద్వారా ఏదైనా కుటుంబంలో ప్రవేశం పొందినచో, మరొకరు దరఖాస్తు చేసుకొనటకు అనర్హులని ఆమె సూచించారు. ఈనెల 22వ తేదీ లోపు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖా కార్యాలయంలో, వనపర్తి దరఖాస్తులు(గజిటెడ్ సంతకంలో)సమర్పించాలని ఆము వివరించారు.

## సీపీసీహెచ్ బ్రిడ్జ్ కోర్సు లేకుండా నియామకాలు చేపట్టాలి

**మహబూబ్‌నగర్‌టౌన్, సెప్టెంబరు13 ప్రభాతవార్త :** తెలంగాణ వ్యాప్తంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ పరిధిలోని బస్తీదావఖాన నియామకాల్లో సీపీసీహెచ్ బ్రిడ్జీ కోర్సు లేకుండా నియామకాలు చేపట్టాలని ప్రగతి శీల యువజన సంఘం (పీవైఎల్) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగాఆ సంఘం నాయకులు సలీం మాట్లాడుతూ ప్రభుత్వం బస్తీ దావఖాన నియామకాల్లో షరతులతో కూడిన ఉత్తర్వులు జారీ చేయడం వల్ల చాలా మంది నిరుద్యోగులు అర్హతకోల్పోతారని, సీపీసీహెచ్‌కోర్సు అర్హత లేకుండా నియామకాలు చేపట్టాలని కోరారు.

## దేవాలయంలో ప్రత్యేక పూజలు

**వెల్దండ, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మహబూబ్‌నగర్ జిల్లా అహ్మెద్‌బాద్ మండలంలోని చౌదర్‌పల్లి గ్రామంలో నూతనంగా రూ.5కోట్లతో నిర్మిస్తున్న బలభీమాంజనేయస్వామి దేవాలయంలో కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి మాట్లాడుతూ గతంలో పురాతన దేవాలయం ఉండేదని, ఇక్కడి స్వామి వారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు తీరుతాయని ఈప్రాంత ప్రజల నమ్మకమని ఆయన పేర్కొన్నారు. దేవాలయ పునర్నిర్మాణానికి రూ.5కోట్లు వెచ్చించి బలభీమాంజనేయస్వామి, సీతారాముల దేవాలయం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మోతిలాల్‌నాయక్, పర్వత్‌రెడ్డి, బక్యనాయక్, నారాయణనాయక్, శేఖర్, పంతుల్లానాయక్, రవినాయక్, గోపాల్‌నాయక్, వెంకట్‌నాయక్, శివలాల్, రామచంద్రయ్య, ఫౌండేషన్ సభ్యులు రమేష్‌నాయక్, చంద్రశేఖర్, అంజయ్య, జగన్, కొండల్, మహేష్, రాహుల్, భీముడు, చెన్నయ్య తదితరులు ఉన్నారు.

## నిజాం పాలన నుంచి తెలంగాణ ప్రాంత విముక్తికి సర్ధార్ కృషి వెలకట్టలేనిది

**వెల్దండ, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రాంతాన్ని పాలిస్తున్న నిజాం నవాబుల చెర నుంచి అప్పటి కేంద్ర హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయిపటేల్ ఆపరేషల్ ఫోలో కార్యక్రమాన్ని ప్రారంభించి తెలంగాణ ప్రాంతానికి నిజాం పాలనను నుంచి విముక్తి కల్పించారని బీజేపీ పార్టీ మండల అధ్యక్షులు యెన్నం విజయేందర్‌రెడ్డి, దళితమోర్చా జిల్లా అధ్యక్షులు కుర్మిద్ధ యాదగిరిలు అన్నారు. వెల్దండ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ముందు సర్ధార్ వల్లభాయిపటేల్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, మల్లేష్, పాండు, రామకృష్ణ, కొండల్, ఉమేష్, విష్ణు, కుమార్, సురేష్, బాబి, అంజి, ఆంజనేయులుతో పాటు తదితరులు ఉన్నారు.

## ఎల్‌ఓసీ అందజేసిన ఎమ్మెల్యే బీరం

**వీపనగండ్ల, సెప్టెంబర్13 ప్రభాతవార్త:** వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామానికి చెందిన డి.సుశీలమ్మ భర్త బాల్‌రెడ్డి అనారోగ్య కారణాలతో నిమ్స్ ఆసుపత్రిలో మెరుగైన చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ పథకం నుండి రూ.1లక్షల50 వేల ఎల్ఓసీ ని మంజూరు చేయించి వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతి ఒక్క నిరుపేద కుటుంబానికి మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో సీఎంఆర్ పథకం ద్వారా లక్షల రూపాలయలను నిరుపేదలకు అందజేసి వారి ప్రాణాలను కాపాడేందుకు అండగా నిలుస్తున్నారని, అర్హులైన ప్రతి ఒక్కరు సీఎంఆర్ఎఫ్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నారు. తమ ఆర్థిక స్థితి గమనించి మెరుగైన వైద్యం నిమిత్తం రూ.1లక్ష50వేలను అందజేసిన ముఖ్యమంత్రి కేసీఆర్, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి కి సుశీలమ్మ కుటుంబ సభ్యులు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తో పాటు టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# జడ్చర్ల ఎమ్మెల్యే వెంటనే పదవికి రాజీనామా చేయాలి

- ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలం
- డబుల్ బెడ్‌రూం, రోడ్ల నిర్మాణం కోసమే నిరాహార దీక్ష
- టిపిసిసి కార్యదర్శి జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి
- కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన అనిరుధ్‌రెడ్డి



ప్రజా సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అనిరుధ్‌రెడ్డి



నిరాహార దీక్షకు హాజరైన మహిళలు

**బాలానగర్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త :** జడ్చర్ల నియోజకవర్గంలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పూర్తిగా విఫలమయ్యారని వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని జడ్చర్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం బాలానగర్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అనిరుధ్‌రెడ్డి సమస్యల పరిష్కారానికి ఒకరోజు నిరాహార దీక్షకు పూనుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలే గ్రామాలలో కనిపిస్తున్నాయని టీఆర్ఎస్ పార్టీ స్థానిక ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి ఎక్కడా కనబడడం లేదని ఆరోపించారు. హామీలు ఇచ్చి వాటిని కాలయాపన చేయడం తప్ప ప్రజలకు ఒరగబెట్టింది ఏమి లేదని ఎద్దేవా చేశారు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి అడిగిన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందజేశారని కాని నేడు టిఆర్ఎస్ ప్రభుత్వం హాయంలో ఇలాంటి పరిస్థితి కనబడడం లేదని అన్నారు. ఇంటి స్థలం ఉండిఇల్లుకట్టు కోలేని నిరుపేదలకు ప్రభుత్వం తరపున మూడులక్షలు అందజేస్తామని కానీ ఇప్పటివరకుఎలాంటి ముందడుగు వేయలేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. అసమర్థ ప్రజా ప్రతినిధులకు ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ది చెప్పాలని రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి తననుఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. జడ్చర్ల నియోజకవర్గంలోఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తన పదవికి రాజీనామా చేసి ఉప ఎన్నికలకు రావాలని, అప్పుడే ప్రభుత్వంభారీగా నిధులు కేటాయిస్తుందని, ప్రజలు కూడాఇదే రకంగాఆలోచన చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు ప్రజా సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదిరమణారెడ్డి, మామిడిగుట్ట శంకర్ నాయక్, నర్సింహారెడ్డి, రాములునాయక్, కత్తెరకృష్ణయ్య, రాఘవేందర్, వెంకట్‌నాయక్, బాబునాయక్, భద్రునాయక్, లక్ష్మణ్ నాయక్, రఫీక్, నవీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళలు, పాల్గొన్నారు.

# వెల్టూరును మండలంగా చేయవలసిందే

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న బీజేపీ అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి

**పెద్దమందడి, సెప్టెంబర్13 ప్రభాతవార్త:** వెల్టూరు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేసి చుట్టుపక్కల గ్రామాల ప్రజల ఆకాంక్ష నెరవేర్చాలని జిల్లా బీజేపీ అధ్యక్షు రాజవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం నాటికి రిలే నిరసన దీక్ష లు 16వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వాల్మీకి సంఘం సభ్యులు సంఘాభావం తెలిపి దీక్ష లో కూర్చున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ నాటి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, నేటి వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్ రెడ్డి గతంలో మండలం ఏర్పాటుచుకు కృషి చేస్తానని మాట ఇచ్చారని ప్రభుత్వం రాష్ట్రంలో నూతన మండలాల ఏర్పాటు చేస్తే తప్పకుండా వెల్టూరు గ్రామాన్ని మండలంగా చేస్తానని మాట ఇచ్చారు ఇప్పుడు మాట నిలబెట్టుకోవాలని సూచించారు. ఈ మధ్య కాలంలో 15 నూతన మండలాలు ఏర్పాటు అయ్యాయి వాటిలో వెల్టూరు మండలం లేకపోవడం దురదృష్టకరం అన్నారు. మండలం అయ్యేదాకా బీజేపీ పార్టీ మీ వెంట ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి కొత్తకాపు మాధవరెడ్డి, జేఏసీ నాయకులు ఎస్.రమేష్, జింకల కురుమయ్య, శివానంద, కుమ్మరిసురేష్, సుంకరియాదయ్య, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, గట్టకానాపురం శ్రీనివాస్ శెట్టి, ప్రేమ్‌సాగర్, బాలరాజు, వాల్మీకి పెద్దలు, యువకులు శిబిరంలో కూర్చోవడం జరిగింది. జయరాములు, బి.శ్రీనివాసులు, శాఖ కృష్ణ, భీమన్న, పెద్ద లక్ష్మన్న, చంద్రాయుడు, శాంతన్న, చెన్నయ్య, కొండన్న, శేఖర్, వెంకటయ్య, సాయిలు, రమేష్, నాగన్న, అడవన్న, కమ్మరి విజయ్, ఆటో ఆంజనేయులు, మాలే వెంకటయ్య, బలిదపల్లి వెంకటేష్, వెంకన్న, బాలకృష్ణ, సాకలి కొండన్న, ఖాజా, రాము, ధర్మేంధర్ సాగర్, ఆవుల నారాయణ, రామచంద్రారెడ్డి, నారాయణ, భాస్కర్, పీటర్ కురుమయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాలు ఇచ్చేంత వరకు కదిలేది లేదు

- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లీ



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లీ

**అమరచింత, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** అమరచింత మున్సిపల్ కేంద్రంలో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు (సీపీఎం) పార్టీ ఆధ్వర్యంలో 7వ రోజు దుబాయ్ కుంటలో పేదలకు ఇండ్ల స్థలాలకు హద్దులు చూపించాలని వారికి డబుల్ బెడ్ రూమ్ కేటాయించాలని స్థలం దగ్గర కెళ్లి హద్దులు పాతుకోవడం గుడిసెలు వేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాన్‌వెస్లా మాట్లాడుతూ అమరచింత లో సర్వే నె.586-87 లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వబడింది. సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో అనేక పోరాటాల ఫలితంగా దుంపాయికుంటలో పేదలకు ఇండ్ల స్థలాలు పట్టాలు ఇవ్వడం జరిగింది. దాదాపు 25 సంవత్సరాలు అవుతున్న ఇప్పటి వరకు ఇచ్చిన పట్టాలకు హద్దులు చూపించడం లేదు, ప్రభుత్వాలు మారినా, అధికారులు మారినా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు కాబట్టి ఈ రోజు గుడిసెల ప్రోగ్రాం నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఒక నెలలో సమస్య పరిష్కరిస్మాని హామి ఇవ్వడం జరిగింది. కానీ ప్రభుత్వాధికారులు ఇచ్చిన హామీ పైన నమ్మకం లేకపోవడంతో లబ్దిదారులు గుడిసెలు 7వ రోజు వేసుకోవడం జరిగింది. అధికారులు స్పందించి వెంటనే సర్వే ను ప్రారంభించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. లేనిచో స్థలాల హద్దులు చూపించే వరకు వివిధ రూపంలో ఆందోళన పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు. పేదలు గుడిసెలలో జీవనం కొనసాగిస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వ అధికారులను హెచ్చరించారు. వెంటనే ప్రభుత్వ అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి పేదలకు మద్దతు చేయించాలని వాళ్లకి డబుల్ బెడ్ రూం ఇండ్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి జీఎస్ గోపి, మండల నాయకులు ఆర్ఎన్‌రమేష్, కాకిశ్రీను, విజయ్, తిరుమలేష్, రమేష్, లక్ష్మణ్, లబ్దిదారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# నులి పురుగులపై ఉపాధ్యాయులకు అవగాహన





నులి పురుగుల నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఉట్కూర్, సెప్టెంబరు13 ప్రభాతవార్త :** ఉట్కూర్ మండల కేంద్రంలో మంగళవారం మండల టాస్క్‌ఫోర్స్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సమక్షంలో పాఠశాల ఉపాధ్యాయులకు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉట్కూర్‌లో అంగన్‌వాడి కార్యకర్తలకు, ఆశ వర్కర్లు ఆరోగ్య సిబ్బందికి జాతీయ నులిపురుగుల నివారణ దినంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈనెల 15వ తేదీ గురువారం 1-19 సంవత్సరాల వయసు గల పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. 1-5 సంవత్సరాలలో వారికి అంగన్‌వాడి కేంద్రంలో, 6-19 సంవత్సరాల వయసు గల పిల్లలకు పాఠశాలల్లో, కాలేజీలలో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. 1-2 సంవత్సరాల్లోపు వయసు గల వారికి సగం మాత్ర ఆల్బెండజోల్ మాత్రను పొడిచేసి పాలల్లో గాని, నీళ్లతో గాని కలిపి తాగించవచ్చన్నారు. 2-19 సంవత్సరాల వయసు వారు ఒక మాత్రను చప్పరించి నమిలి మింగాలన్నారు. ఈ ఆల్బెండజోల్ మాత్ర మింగించడం వల్ల పిల్లల రక్తహీనత, పోషకాహార లోపం, బరువు తగ్గుట, ఏకాగ్రత లోపించడం మొదలైన లక్షణాలన్ని కూడా రాకుండా నివారించగలుగుతుందన్నారు. జ్వరంతో గాని, వేరే అనారోగ్య కారణాలతో బాధపడుతూ ఉండే పిల్లలకు ఈ మాత్రల పంపిణీ జ్వరం గాని, అనారోగ్యం కాని తగ్గిన తర్వాత ఇవావ్వలన్నారు. 15వ తేదీ గురువారం రోజు మాత్రలు తీసుకోకుండా మిగిలిన పిల్లలకు ఈ నెల 22వ తేదీ గురువారం రోజు ఆల్బెండజోల్ మాత్ర పంపిణీ చేయాలన్నారు. సమావేశంలో వైద్యాధికారి డా. సాయికుమార్, ఆరోగ్య విస్తరణాధికారి విజయ్‌కుమార్, పర్యవేక్షకురాలు మణిమాల, ఆరోగ్య కార్యకర్తలు కవిత, మహేశ్వరి, సుజాత అంగన్‌వాడి కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

**గోపాల్‌పేట, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ సమావేశంలో రేవల్లి, గోపాల్‌పేట మండలాల ఉపాధ్యాయులకు దాజమంజుల ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ 1-19 సంవత్సరాల పిల్లల జీర్ణాశయంలో నులి పురుగులు, కొంకి పురుగులు, ఏలికల పాములు, పరాన్న జీవులు ఉంటాయని దీని మూలానా విద్యార్థులు శారీరకంగా ఎదగకుండా చేస్తాయని డాక్టర్లు వివరించారు. వాటి నిర్మూలనకు ఆల్బెండజిల్ 400 ఎంజీ మాత్రలు తినడం ద్వారా నులి పురుగులను నిర్మూలించవచ్చునని అంతేకాక వ్యక్తి గత పరిశుభ్రత పాటించాలని మలవిసర్జన అనంతరం చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం వలన నులి పురుగులను నివారించవచ్చునని డాక్టర్ తెలిపారు. 1-19 సంత్సవరాలమధ్య వయస్సు ఉన్న పిల్లలకు అల్బెండజిల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. ఏడాది నుండి రెండో ఏడాది వరకు సగం మాత్రం రెండో ఏడాది వరకు 19 ఏళ్ల వయస్సు వరకు పూర్తి మాత్ర వయవచ్చునని తెలిపారు. జాతీయ నులి పురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆశాకార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి సురేష్ కుమార్, సూపర్ వైజర్లు సుచిత్ర, కౌసల్య, సిబ్బంది, వెంకటమ్మ, జుమిత్ర, నాగమణి, బాళీశ్వరమ్మ, పద్మావతిచ, విజయలత, జ్ఞానేశ్వర్, మధుబాబు, శాంతి భూషణ్ తదితరులు ఉన్నారు.

# 100 శాతం రుణ ప్రణాళిక చేరుకునే విధంగా కృషి చేయాలి

## -డిఆర్‌డిఓ నర్సింగరావు



మాట్లాడుతున్న డిఆర్‌డిఓ నర్సింగరావు

**నాగర్‌కర్నూల్, సెప్టెంబరు13 ప్రభాతవార్త:** గ్రామంలోని ప్రతిసంఘ సభ్యురాలు రుణ అవసరాలు తీర్చే విధంగా, జీవనోపాదులు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా ఎదిగేలా క్షేత్రస్థాయి సిబ్బంది కృషి చేయాలని, నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు ఉంటాయని డిఆర్‌డిఓ నర్సింగరావు తెలిపారు. మండల సమాఖ్యలు, ప్రభుత్వ భాగస్వామ్య సంస్థ స్త్రీనిధి ద్వారా మహిళా సంఘ సభ్యులకు అందిస్తున్న రుణాల అమలు, వినియోగం, ఎన్‌పిఎపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి, బ్యాంకు రుణాల ద్వారా మహిళలు జీవనోపాదులు ఏర్పాటు చేసుకుని నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారని కుటుంబానికి అండగా నిలుస్తున్నారని అన్నారు. జిల్లాలో 100 శాతం రుణ ప్రణాళిక చేరుకునే విధంగా కృషి చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించారు. రుణాల వడ్డీ, వాయిదాలు, నెలవారి చెల్లింపు, రుణ కాలానికి వారు చెల్లించే వడి మొత్తం, ఇతర అన్ని అంశాలు సభ్యురాలు పూర్తి అవగాహన కలిగి ఉండేలా చూడాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి సిబ్బందిదే అన్నారు. ఈనెల 16న జాతీయ సమైక్యత వజ్రోత్సవాలలో భాగంగా నియోజకవర్గంలో 15 వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఈ ర్యాలీలో మహిళా సంఘ సభ్యులు అధిక ంగా పాల్గొనేలా అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో రీజినల్ మేనేజర్ రామచంద్రుడు, స్త్రీనిధి మేనేజర్లు జయదుర్గ, విక్రమ్‌కుమార్, నాగరాజు, సిసిలు, విఓఎలు పాల్గొన్నారు.

## రెచ్చిపోతున్న మందుబాబుల ఆగడాలు

**శ్రీరంగాపురం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గుర్తు తెలియని కొందరు వ్యక్తులు మద్యం సేవించి, ఆ మద్యం మత్తులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని టాయిలెట్స్ పీవీసీ పైపులను, కళాశాల పైన ఉన్న పిల్లర్ దిమ్మెలను పగలగొట్టినారు. ఇది శ్రీరంగాపురంలో కొందరు తాగుబోతుల ఘనకార్యం చూడండని సోషల్ మీడియాలో పోసుట్లుఉ రాగా దానికి స్పందించిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంగాధర్ యాదవ్ పైప్‌లైన్ లీకేజీ లను తన సొంత ఖర్చులతో చేయిస్తానని ముందుకు వచ్చారు. గంగాధర్ మాట్లాడుతూ మండల కేంద్రంలో ఇలాంటి ఘటనలు పునారావృతం కాకుండా చూడాలని, పోలీసుల చొరవ తీసుకొని మందు బాబుల ఆగడాలకు కళ్లెం వుయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగావారితో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు అరవింద్, ఆటో రమేష్, జూనియర్ కళాశాలలెక్చరర్ కురుమూర్తి ఉన్నారు.

## క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి

**తెల్కపల్లి, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** క్షయవ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని బొప్పెల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డా. ప్రదీప్‌కుమార్ ప్రజలకు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని ఆలేరు సబ్ సెంటర్ ఆధ్వర్యంలో ఆలేరులో క్షయవ్యాధి క్యాంపు నిర్వహించి టిబి పరీక్షలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాల పాటు ఎడతెరిపి లేని దగ్గుతో బాధపడుతున్న వారు నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించి తమ సమస్యను వివరించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్షయవ్యాధి బారిన పడిన వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు వచ్చే తుంపర్ల ద్వారా ఇతరులకు సోకే అవకాశం ఉందని, వ్యాధి బారిన పడిన వారు విధిగా మాస్కులు ధరించాలని, వ్యాధి సోకిన వారిని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా డెంగ్యూ, మలేరియా లాంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని దోమల నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ల్యాబ్ టెక్నిషియన్ శ్రీధర్‌రెడ్డి, ఎఎన్ఎం నిరంజనమ్మ, ఆశా కార్యకర్తలు మంజుల పాల్గొన్నారు.

## ఈదుల చెరువును పరిశీలించిన తహసీల్దార్

**వెల్దండ, సెప్టెంబర్13, ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామ పంచాయతీలో ఈదుల చెరువు ప్రక్కన నిబంధనలను తుంగలో తొక్కి వెంచర్‌ను ఏర్పాటు చేశారనే పలువురు ఫిర్యాదు మేరకు మంగళవారం ఆర్ఐ శంకర్, సర్వేయర్ అనసూయలతో కలిసి తహసీల్దార్ చంద్రశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ వెంచర్ ఏర్పాటుపై పలు ఫిర్యాదులు రావడంతో వెంచర్‌ను, ఈదుల చెరువును పరిశీలించామని, అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. పూర్తి నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

## రుణమాఫీ ఎక్కడ చేశారు?

**అడ్డాకుల, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో రైతుల రుణమాఫీ ఎక్కడ చేశారని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు శర్మిల ప్రశ్నించారు. మహాప్రస్థానం పాదయాత్రలో బాగంగా మంగళవారం మండల పరిదిలోని దుబ్బపల్లి, పొన్నకల్ గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా మహిళలను, రైతులను ఉద్దేశించి మాట్లాడారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రేషన్ దుకాణాలలో బియ్యంతో పాటు నిత్యావర సరుకులను పంపిణీ చేసేవారని ప్రస్తుతం బియ్యం తప్ప ఏమి ఇవ్వటం లేదని విమర్శించారు. ఇంట్లో ఒక్కరికే పెన్షన్ ఇస్తే సరిపోతుందా అని ప్రశ్నించారు. కేసీఆర్ 16వేల కోట్ల మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని 4 లక్షల కోట్ల అప్పుల తెలంగాణ చేశారని విమర్శించారు. బంగారు తెలంగాణకు బదులు బీర్ల తెలంగాణను చేశారని, అడుగడుగునా బెల్ట్ షాపులు పెట్టించి ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నాడని అసహనం వ్యక్తం చేశారు. పొలాల వెంటవున్న రైతులను, ఆటో, బస్సులో వెళ్తున్న ప్రయాణీకులను, పలుకరించుకుంటూ రాష్ట్రంలో రాజశేఖర్‌రెడ్డి రాజ్యం వస్తేనే అందరూ బాగుపడుతారని రానున్న ఎన్నికలలో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీని ఆదరించి ఓట్లు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

## ఏటీఎమ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

**దేవరకద్ర రూరల్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం కౌకుంట్లలో ఏటీఎమ్ ఏర్పాటుకు మంగళవారం స్థలపరిశీలన చేశారు. గ్రామస్థుల అవసరాల దృష్ట్యా గ్రామ నాయకుడు కిషన్‌రావు ఇండియా ఏటిఎమ్ 1 అధికారులతో చర్చించి ఏటీఎమ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నారు. త్వరలో కౌకుంట్ల గ్రామస్థులకు ఏటీఎమ్ సేవలు అందనున్నాయి. దీంతో నాయకుడు కిషన్‌రావును గ్రామస్థులు అభినందించారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**కోయిల్‌కొండ, సెప్టెంబరు13 ప్రభాతవార్త :** మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు పగిడ్యాల శ్రీనివాస్ గత మార్చి మాసంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇంటికి పెద్దదిక్కుగా ఉన్న శ్రీనివాస్ మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని కొంతమేరనైనా ఆదుకోవాలని మండల ముదిరాజ్ సంఘం నేతలు మంగళవారం మండల కేంద్రమైన కోయిల్‌కొండలో సమావేశమై శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ముదిరాజ్ సంఘం బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారని ఆ సంఘం నేతలు ఈ సందర్భంగా అన్నారు. పత్రికా రంగంలో చాలా సంవత్సరాల పాటు వివిధ పత్రికలలో జర్నలిస్టుగా విధులు నిర్వహించారన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేతలు మోదిపూర్ రవి, కోయిల్‌కొండ సర్పంచ్ బి. కృష్ణ, వెంకటయ్య, మాధవులు, గోపాల్, రామకృష్ణ, వెంకటయ్య, ముదిరాజ్ సంఘం సర్పంచ్‌లు ఆంజనేయులు, హనుమంతు, సాయుబ్ తదితరులు పాల్గొన్నారు.

## గోడ పత్రికల విడుదల

**కల్వకుర్తి, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** ఈ నెల 14,15,16వ తేదీల్లో కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పోతుగంటి అరవింద్ పేర్కొన్నారు. మంగళవారం కల్వకుర్తి మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పారా మెడికల్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ 4వ మహాసభల గోడపత్రికను విడుదల చేశారు. ఈ సందర్భంగా అరవింద్‌మాట్లాడుతూ దేశ, రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగాన్ని ప్రైవేటు పరం చేస్తున్నారని, దాని వల్ల పేద విద్యార్థులు చదువులకు దూరమవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనపథకం అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్స్, ఫీ రీయంబర్స్‌మెంట్‌లు, మెస్, కాస్మొటిక్ బిల్లులనువెంటనేవిడుదల చేయాలనిడిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీధర్, నరేష్, విక్రమ్, శిరీష, కల్పన తదితరులు ఉన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా జరపాలి

**● బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యంగారి ప్రభాకర్‌రెడ్డి**



సర్దార్‌వల్లభ్ భాయి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

**వనపర్తి టౌన్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ నిజాం నవాబుమీర్ ఉస్మాన్ అలీ ఖాన్ హైదరాబాద్ సంస్థానాన్ని పాకిస్థాన్ లో విలీనం చేసే ప్రక్రియ మరియు భారత్ సైనిక చర్యకు దిగితే యుద్ధంలో మద్ద తుగా నిలవడానికి పాకిస్తాన్ ప్రభుత్వానికి రూ.20 కోట్లను కట్టడం గురించి తెలుసుకున్న ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయి పటేల్ భారత్‌లో విలీనం చేయాలని విజ్ఞప్తి చేయగా పటేల్ విజ్ఞప్తులను నిజాం నవాబు బుట్ట దాఖలు చేయడంతో మేనేజర్ జనరల్ చౌదరి ఆధ్వర్యంలో ఆపరేషన్ ఫోలో పేరుతో నలుదిక్కుల సైనికులను దించి సెప్టెంబర్ 13న ప్రారంభించిన హైదరాబాద్ రహదారుల వెంట యుద్ధ ట్యాంకులు, ఆయుధ వాహనాలు, పదాతి దళాలు దూసుకు వచ్చి ముప్పేట దాడులు చేస్తుండడంతో సెప్టెంబర్ 16 నాటికి నిజాం కు వాస్తవ పరిస్థితి అర్థమై 16 సాయంత్రం ప్రధానమంత్రి మీర్ లాయక్ అలీ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించగా, 17న భారతప్రభుత్వ ప్రతినిధి మున్షి ఆదేశంతో హైదరాబాద్ సైన్యం తరుపున కాల్పులు విరమణ చేస్తున్నామని ఐక్యరాజ్యసమితి సెక్యూరిటీ కౌన్సిల్ కు ఇచ్చిన ఫిర్యాదును వెనకకు తీసుకుంటున్నామని ప్రకటించడంతో హైదరాబాద్ ప్రాంతం స్వేచ్ఛా వాయువులను పీల్చు కుందని, జనమంతా భారత జాతీయ జెండాలతో హైదరాబద్ నగరాన్ని త్రివర్ణ మయం చేశారని గుర్తు చేశారు. ఉప ప్రధానిగా ఉన్న సర్దార్ వల్లభ్ భాయి పటేల్ 540పైగా సంస్థాలను శాంతియుతంగా భారత్ లో విలీనం చేయగా ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బాధ్యతలు తీసుకున్న కాశ్మీర్, తెలంగాణ విషయంలో విఫలం చెందారని దాని ఫలితంగా 2021 వరకు కాశ్మీర్ రావణకాష్టంలా రగిలిందని, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 2021లో ఆర్టికల్ 370 రద్దు ద్వారా జమ్ము కాశ్మీర్ లో భారత రాజ్యాంగం అమలవుతుందని పారిశ్రామికంగా ఉన్నత విద్యాపరంగా ముందుకు వెళ్తుందని తెలియజేశారు. సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని ప్రభుత్వమే అధికారికంగా జరపాలని చాలా కాలం గా బీజేపీ పార్టీ ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని 8 ఏళ్లే ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ కూడా మజ్లీస్ పార్టీ కి భయపడే విమోచన దినోత్సవం జరపలేదని,



ఈ సంవత్సరం సెప్టెంబర్ 17న కేంద్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవంలో నాటి హైదరాబాద్ సంస్థానంలో ఉన్న కరాణటక, మహారాష్ట్ర ముఖ్య మంత్రులు అతిథులుగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో విమోచన దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న ఫలితంగా, ముఖ్యమంత్రి కేసీఆర్ మజ్లిస్ పార్టీ సూచన మేరకు జాతీయ సమైక్యత దినం జరపాలని నిర్ణయించడం బీజేపీ పార్టీ విజయంగా భావిస్తున్నామని చర్చల ద్వారా శాంతియుత మార్గాల ద్వారా హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కాలేద కేవలం సైనిక చర్య ద్వారా సర్దార్ వల్లభ్ భాయి పటేల్ తెలంగాణ ప్రాంతానికి విమో,న కల్పించారు. కావున ఇది ముమ్మాటికి తెలంగాణ కు విమోచన దినోత్సవం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీరాష్ట్రకార్యవర్గ సభ్యులు అయ్యంగారి ప్రభాకర్‌రెడ్డి, బి.కృష్ణ, సబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కోకన్వీనర్ జింకల కృష్ణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామన్ గౌడ్, సీనియర్ నాయకులు కొమ్ము సామేలు, అధికార ప్రతినిధులు బచ్చు రాము, పెద్దిరాజు, మైనార్టీ మోర్చ అధ్యక్షుడు ఎండి కరీం, జిల్లా కార్యవ్గ సభ్యులు ద్వారపోగు సుబ్రమణ్యం, ఓం ప్రకాష్ చారి, పట్టణ ప్రధాన కర్యాదర్శి మామిళ్లపల్లి రాయ న్న, ఉపాధ్యక్షుడు ఉండెకోటి శ్రీకాంత్, మండల ప్రధానకార్యదర్శి పోతు శ్రీనివాసులు, కంది వెంకటరమణ, కుమ్మరి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

**గోపాల్‌పేట, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** సర్దార్ వల్లభ్ భాయి పటేల్ అడుగుజాడల్లోనే మోదీప్రభుత్వం పని చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి. రాష్ట్ర బీజేపీ పిలుపు మేరకు గోపాల్‌పేట మండలంలో సర్దార్ వల్లభ్ భాయి పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ సర్దార్ వల్లభ్ భాయి పటేల్ చేసిన కృషి వల్లే నిజాం కబంధ హస్తాల్లో ఉన్న హైదరాబాద్ సంస్థానం భారత్ లో విలీనమైందని గుర్తు చేశారు. సర్దార్ వల్లభ్ భాయి పటేల్ ఆశయాలతోనే ముందుకెళ్తున్నామని స్పష్టం చేశారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అరవింద రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణ యాదవ్, ప్రధానకార్యదర్శి నాగరాజు, కిసాన్ మోర్చ అధ్యక్షుడు వి.వెంకటేష్ యువ మోర్చ మండల అధ్యక్షుడు దిలీప్, మండ ఉపాధ్యక్షుడు గంగాధర్, బూత్ అధ్యక్షుడు మల్లికార్జున్, శివశంకర్, కురుమూర్తి, వెంకటష్ తదితరులు ఉన్నారు.

## ఘనంగా ఆర్.కృష్ణయ్య జన్మదిన వేడుకలు



ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

**జడ్చర్ల, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** బిసి దళపతి, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని బాదేపల్లి కమ్యూనిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో బిసిసేన ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బిసిసేన నాయకులు స్వామి, లింగంపేట శేఖర్‌లు మాట్లాడుతూ 47 సంవత్సరాలుగా నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఏకైక నాయకుడు ఆర్. కృష్ణయ్య అనిఫీజు రియాంబర్స్‌మెంట్ పథకం, గురుకుల పాఠశాలలో ఏర్పాటు, సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ఏర్పాటుకు ముఖ్య కారకులు ఆర్. కృష్ణయ్య అని గుర్తు చేశారు.ఆయన ఉద్యమం ద్వారానేఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యా వ్యవస్థలో పెనుమార్పులు తీసుకురావడం వల్ల బడుగులకు విద్యనందిం చిందని తెలిపారు. ఆర్. కృష్ణయ్య జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చాలని, ఆయన సేవలను గుర్తించి కేంద్రప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, నిరంజన్, విజయ్‌కుమార్, గోవింద్, రాజ్ పాల్గొన్నారు.

## యథేచ్ఛగా కొనసాగుతున్న అక్రమ ఇసుక రవాణా

**దామరగిద్ద, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో సాయంత్రం కాగానే అక్రమ ఇసుక రవాణా యథేచ్ఛగా కొనసాగుతుంది. అక్రమ ఇసుక రవాణా ఇటు పోలీస్ అటు గ్రామాలలో ప్రజా ప్రతినిధుల సహకారంతో కొనసాగుతుందని ఆయా గ్రామాల ప్రజలు కోడై కూస్తున్నారు. ముఖ్యంగా నారాయణపేట మండలం పేరపల్ల గ్రామానికి చెందిన 5 ట్రాక్టర్లు సాయంత్రం కాగానే వత్తుగుండ్ల మీదుగా అక్రమ ఇసుక రవాణా కొనసాగిస్తున్నాయి. పలు మార్లు ఈ విషయాన్ని పోలీస్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణాపై కఠిన తీసుకోవాలని ఆయా గ్రామాల యువకులు కోరుతున్నారు. ఈ విషయంపై తహసిల్దార్ వెంకటేష్‌ను వివరణ కోరగా అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు తీసుకుని కేసులు నమోదు చేస్తామన్నారు.

## అంత్యక్రియలకు అభిమన్యురెడ్డి ఆర్థిక సాయం



**రాజాపూర్, సెప్టెంబరు13 ప్రభాతవార్త:** మండలంలోని ముదిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కావలి జంగమ్మ (80) అనారోగ్యంతో మృతి చెందారు. వారి మృతికి సంతాపం ప్రకటించి, అంత్యక్రియలకు ఆర్థిక సాయంగా టిఆర్ఎస్ పార్టీ యువ నేత చించోడ్ అభిమన్యురెడ్డి యువసేన సభ్యుల ద్వారా రూ. 5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పెంటయ్య, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, వార్డు మెంబర్ రాములు, కావలి సత్తయ్య, కావలి శ్రీనివాసులు, కృష్ణయ్య, బాల్‌చెన్నయ్య, నర్సింహులుగౌడ్, బాలయ్య, గ్రామస్తులు, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

## మూడు క్వింటాళ్ల పిడిఎస్ బియ్యం స్వాదీనం

**గద్వాల క్రైమ్ సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** గద్వాల అర్బన్ అక్రమంగా ఆటోలో తరలిస్తున్న మూడు క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని సోమవారం గద్వాల గ్రామీణ పోలీసులు స్వాదీనం చేసుకున్నారు.గ్రామీణ ఎస్ఐ ఆనంద్ కథనం మేరకు గద్వాల పరిధిలోని షేర్లవీధికి చెందిన ఎరుకలి వీరేష్ కుటుంబాల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనగోలు చేసి చెరువులు ఉండే ప్రాంతాల ప్రజలకు విక్రయించేందుకు ఆటోలో తరలిస్తున్న పోలీసులు పట్టుకున్నారు.అక్రమంగా తరలిస్తున్న 3.30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాదీనం చేసుకొని పోలీస్‌లు తరలించారు. అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా పిడిఎస్ బియ్యాన్ని విక్రయించేందుకు యత్నించిన వీరేష్‌ను అదుపులోకి తీసుకున్నారు.కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

## బ్యాటరీ ట్రై సైకిళ్ల గుర్తింపు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**లింగాల, సెప్టెంబరు13 ప్రభాతవార్త:** దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్ల లబ్దిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న గుర్తింపు శిబిరాన్ని అర్హులైన వారు సద్వినియోగ పరచుకోవాలని దివ్యాంగుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆవంచ దేవేందర్, మండల అధ్యక్షులు జబ్బార్ కోరారు. మంగళవారం లింగాలలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన అచ్చంపేట మండలం రంగాపురం రైతు వేదికలో ఉదయం 10 గం.లకు నియోజకవర్గంలోని అన్ని మండలాల శారీరక వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల కొరకు ఐడెంటిఫికేషన్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 80 శాతం శారీరక వికలత్వం,16 సంవత్సరాల పైబడిన వారు ఆధార్ కార్డు, సదరం సర్టిఫికెట్ 80 శాతం కులం, ఆదాయ ధృవపత్రాలు, తెల్ల రేషన్‌కార్డు జిరాక్స్‌తో పాటు రెండు పాస్ ఫొటోలతోఈ క్యాంపులో హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఈ సదవకాశాన్ని లింగాల మండలంలోని శారీరక వికలాంగులు 80 శాతం ఉన్న దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా దివ్యాంగుల సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు సైదమ్మ, మండల సంఘం ఉపాధ్యక్షులు చందులాల్, కోశాధికారి హుస్సేన్, ఎండి చాంద్‌పాషా, బండారు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## లెక్చరర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

**గోపాల్‌పేట, సెప్టెంబర్13 ప్రభాతవార్త:** గోపాల్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అర్థశాస్త్రం సబ్జెక్టు ను బోధించుటకు అతిథిగా అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ జి.ఉమామహేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పీజీ లో కనీసం 50% మార్కులతో పాసై ఉండాలని ఆసకింత గల అభ్యర్థులు ఈనెల 16వ తేదీ సాయంత్రం 3 గంటలలోపు కళాశాల ప్రిన్సిపల్ కు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం తీసుకోవాలి

**◆మున్సిపల్ చైర్మన్ నరసింహగౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ నరసింహగౌడ్

**అచ్చంపేట, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** పౌష్టిక మాసం సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన అంగన్‌వాడి సూపర్‌వైజర్ టీచర్ల కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ నరసింహగౌడ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే అంగనవాడి కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు తప్పని సరిగా తీసుకోవాలని అన్నారు. ఐదు సంవత్సరాలలో తమ పిల్లలను అంగన్‌వాడి కేంద్రాలకు తప్పనిసరిగా పంపాలని చిన్నారుల పట్ల అంగన్‌వాడి టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రతినెల వయసుకు తగ్గ ఎత్తు బరువు ఉండే విధంగా చూసి పౌష్టికాహారం అందించాలని సూచించారు. అనంతరం ఐసిడిఎస్ అధికారి దమయంతి మాట్లాడుతూ అంగన్‌వాడి కేంద్రాల్లో గర్భిణీలకు, బాలింతలకు పౌష్టికాహారం అందించడం జరుగుతుందని, తమ పిల్లలను కూడా క్రమం తప్పకుండా అంగన్‌వాడి కేంద్రాలకు పంపాలని మహిళలకు సూచించారు. అంగన్‌వాడి కేంద్రాల్లోని ప్రభుత్వం అందించే పౌష్టికాహారం లభిస్తుందని వాటివల్ల బాలింతలు, గర్భిణీలు, చిన్నారులు ఆరోగ్యవంతంగా ఉంటారని 0–5 లోపు పిల్లలువయసుకు తగ్గ ఎత్తు, బరువు ప్రతినెల చూసుకోవడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, అంగన్‌వాడి సూపర్‌వైజర్ బిపాసా, అంగన్‌వాడి టీచర్లు, అంగన్‌వాడి కార్యకర్తలు, పట్టణ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అంగన్‌వాడీ టీచర్లు

## ప్రతి ఒక్కరూ బూస్టర్ డోస్ వేయించుకోవాలి

**◆జిల్లా బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు వారణాసి కల్పన**



విద్యార్థులకు బూస్టర్ డోస్ వేస్తున్న వైద్య సిబ్బంది

**వనపర్తి టౌన్, సెప్టెంబర్13 ప్రభాతవార్త:** మంగళవారం వనపర్తి పట్టణంలోని ఎస్‌వీఎంఆర్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు కరోనా వ్యాక్సిన్ బూస్టర్ డోస్ వేయించడం జరిగిందని బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు వారణాసి కల్పన పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు కూడా బూస్టర్ డోస్ వేయించుకోవాలని వ్యాక్సిన్ వేయించుకోవడం వల్ల తమకేదో అవుతుందనే భయంతో అపోహలతో ఇంకా చాలా మంది ఉన్నారని బూస్టర్ డోస్ వేయించుకోనివారు ఇంకా ఉన్నారని ఎలాంటి అపోహలకు తావివ్వకుండా అందరూ కూడా వ్యాక్సిన్ వేయించుకోవాలని కొత్త కొత్త వేరియంట్లతో కరోనా వైరస్ విజృంభిస్తున్న సందర్భంగా అందరు తప్పనిసరిగాబూస్టర్ డోస్ వేయించుకోవాలని వ్యాక్సిన్ వేయించుకోవడం వల్లే మనం ధైర్యంగా ఉండగలుగుతున్నామని అందరు వ్యాక్సిన్ వేయించుకొని కరోనా రహిత సమాజాన్ని నిర్మించాలని ఆమె పేర్కొన్నారు. కళాశాలలకి, స్కూళ్లకు, ఇంటింటికి వెళ్లి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగరాజు, కరస్పాండెంట్ చంద్రమౌళి, చాంద్‌పాషా, అధ్యాపకులు బుచ్చన్న, దివ్య, రాఘవేందర్, మన్యం, మోహన్, కరుణాకర్, పాల్గొన్నారు.

## పాన్‌గల్ కస్తూర్భాను సందర్శించిన ఎంపీపీ



కస్తూర్భా పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

**పాన్‌గల్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలను పోలవరం మండల పరిషత్ అధ్యక్షుడు మామిళ్లపల్లి శ్రీధర్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కస్తూర్బా పాఠశాలల్లో తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతతో రుచిరకమైన భోజనం ఏర్పాటు చేయాలని ఎస్ఓ హేమలత కు సూచించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. మిగిలిపోయిన ప్రహరీ గోడ నిర్మాణం, త్రాగునీటి సౌకర్యం, డైనింగ్ హాల్ లాంటి సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అంతకు ముందు ఎంపీపీ శ్రీధర్ రెడ్డి విద్యార్థినిలతో మాట్లాడుతూ భోజనం నాణ్యతతో లేకుంటే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నాగేశ్వర్ రెడ్డి, సర్పంచ్ సింగిరెడ్డి గోపాల్‌రెడ్డి, పంచాయితీ రాజ్ ఏఈ సత్తయ్య, మండల తెరాస అధ్యక్షుడు రాము యాదవ్, నాయకులు నిరంజన్ రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల విద్యార్థులకు ఆర్థిక చేయూత

**శ్రీరంగాపురం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** మండల పరిధిలోని జానంపేట గ్రామానికి చెందిన శశిరెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు శశిరెడ్డి జ్ఞాపకార్థం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం స్వామినాథ్ మాట్లాడుతూ పాఠశాలకు ఆర్థిక సహాయంతో పాటు విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శశి రెడ్డి కుటుంబ సభ్యులు మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందుకు వెళ్లాలని, బాగా చదివి ఉన్నత స్థానాలు అధిరోహించాలని, మీరు కూడా ఇంకొకరికి సహాయపడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు ప్రవీణ్‌రెడ్డి, సుధాకర్, వేణుగోపాల్, ఖయ్యూం పాల్గొన్నారు.



## రైతులకు అవగాహన సదస్సు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

**శ్రీరంగాపురం, సెప్టెంబర్13 ప్రభాతవార్త:** మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ రైతు వేదికలో కుబోటా వరి కోత మిషన్ల పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుబోట మిషన్ తెలంగాణ స్టేట్ హెడ్ వంశీకృష్ణ ముఖ్య అతిథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా త్రిశూల్ ఆటోమేటిక్స్ డీలర్ నికేతన్ యాదవ్ మాటాడుతూ కుబోట వరి కోత మిషన్ కోయడం వలన పెట్టుబడి తగ్గుంతుందని లేబర్ తో కోయడం వలన అధిక ఖర్చులు అవుతాయని ఆయన అన్నారు. కుబోట మిషన్‌వరి కోతలు కోయడం వలన ఎలాపని చేస్తుందో అనే విషయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు కైలాబ్, రవి, నరేష్, రాజు, కృష్ణయ్య, శివుడు, భాస్కర్ రెడ్డి, జానంపేట రైతులు, వెంకటాపురం రైతులు పాల్గొన్నారు.

## వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



**గద్వాల సెప్టెంబర్13 ప్రభాతవార్త:** రోడ్లపై ప్రయాణించే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాటిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్ఐవిజయ్ భాస్కర్ వాహనదారులను హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో వాహనదారులకు ట్రాఫిక్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారులు తమ వాహనాలకు ఉన్న పెండింగ్ చాలన్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్, ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా చెల్లించాలన్నారు. పట్టణంలోని ఉన్న ఆటోమెటిక్ సిసి కెమెరాల సిగ్నల్ సమయం పడకముందే వాహనదారులు సిగ్నల్ జెంపింగ్ చేసిన ఆటోమేటిక్ సిసి కెమెరా క్లిక్ చేయబడుతుందని అలాగే చాలనా విధించడం జరుగుతుందన్నారు. వాహనాలకు నెంబర్‌ప్లేట్లు సరిగాలేకున్న అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేస్తామన్నారు. మైనర్‌లకు వాహనాలు ఇచ్చిన వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ఎలాంటి ధృవపత్రాలు వాహనాలను పోలీస్ స్టేషన్‌లకు తరలిస్తామన్నారు. అదే విధంగా హెల్మెంట్, సిటబెల్టు ధరించాలని ర్యాష్‌డ్రావింగ్ చేయరాదని పరిమిత వేగంలో వాహనాలను నడపాలని డ్రంక్ అండ్ డ్రైవ్ చేయరాదని ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మండల స్థాయి ఉపన్యాస పోటీల్లో పాన్‌గల్ విద్యార్థుల ప్రతిభ



**పాన్‌గల్, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సుస్థిర అభివృద్ధి ప్రాథమిక శాస్త్రాల సవాళ్లు అనే అంశంపై మంగళవారం మండల స్థాయిలో నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో పాన్‌గల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. ఉపన్యాస పోటీలలో మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొనగా ఇంగ్లీష్ మీడియంలో పాన్‌గల్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి వినయ్ కుమార్ మొదటి విజేతగా నిలువగా, ఇదే పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న కల్పన 2వ విజేతలుగా నిలిచారు. తెలుగు మీడియంలో పాన్ గల్ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి శ్రీకాంత్ మొదటి విజేతగా నిలువగా అదే పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని అమ్ములు 2వ విజేతలుగా నిలిచారు. మండలస్థాయిలో నిర్వహించిన ఉపన్యాసపోటీల్లో4బహుమతులు పానగల్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు గెలుచు కోవడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## బీసీ బంధు ప్రకటించాలి



మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆశన్న

**ఖిల్లాఘనపురం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త:** మండల పరిధిలోని సోళీపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి ఆశన్న మాట్లాడుతూ వెనుకబడిన బీసీ కులాల వారికి బీసీ బంధు పథకాన్ని ప్రకటించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు రైతుబంధు, దళితులకుదళిత బంధు అందజేసిన విధంగా బీసీ కులాల వారికి బీసీ బంధు పథకాన్ని ప్రవేశ పెట్కిట ఆర్థికంగా చితికి పోయి ఉన్న బీసీ కులాలను అభివృద్ధి పరచాలని అన్నారు. ఓబీసీ కులాల వారు యంత్రికరణ యుగంలో చేతి వృత్తుల వారికి పని లేకుండాపోతుందని గుర్తు చేశారు. వడ్డెర, రజక కులాల వారి పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారైందని ఆయా కులాల కార్పోరేషన్లకు నిధులు కేటాయించి చైర్మెన్‌లను ఏర్పాటు చేయాలని అన్నారు. నాయిబ్రహ్మణ కులాల వారికి దేవాలయాల్లో పనిచేసే వారికి క్షౌర, వాయిద్య కళాకారులకు దేవాలయ కమిటీల్లో డైరెక్టర్లుగా నియమించాలని కోరారు. తెలంగాణ ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సమన్యాయం చేసేలా పథకాలను అందించాలని అన్నారు.

## హైదరాబాద్‌లో విఆర్‌ఏల అరెస్టు



హైదరాబాద్‌లోని పోలీస్ స్టేషన్ ఆరవణలో విఆర్‌ఏలు

**ఇటిక్యాల సెప్టెంబర్13 ప్రభాతవార్త:** గ్రామీణ రెవెన్యూ శాఖలో ఆధ్వర్యంలో విధులు నిర్వహిస్తున్న రెండెళ్ల కిందట ముఖ్యమంత్రి కేసిఆర్ నిండు అసెంబ్లీ సాక్షిగాఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 50 రోజు లుగా నిరవధిక దీక్షలు చేపట్టారు. అందులో బాగంగా జెఏసీ కమిటీ పిలుపు మేరకు విఆర్‌ఏలు సోమ, మంగళ రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి పిలుపునియగా పోలీస్‌లు అడ్డుకోని విఆర్ ఏలను అరెస్టు చేశారు. అందులో ఇటిక్యాల విఆర్‌ఏల మండల నాయకులు శివశంకర్, పరుషరాముడు, మహేశ్ తదితరులను పోలీస్ అరెస్టు చేశారు.

## కెజిబివి పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన అధికారులు



పాఠశాలను తనిఖీ చేసి మాట్లాడుతున్న అధికారులు

**ఉట్కూర్, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నిడుగుర్తి మండల పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాల, కెజిబివి పులిమామిడిని జిల్లా సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, ఎఫ్ఎఓ మంజుల ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మన ఊరు మనబడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలను ప్రైవేట్‌కు ధీటుగా అభివృద్ధి చేస్తుందని కావున పనులను వేగంగా పూర్తి చేయాలని తెలిపారు. తొలిమెట్టు కార్యక్రమాన్ని ఉపాధ్యాయులందరు బాధ్యతాయుతంగా నిర్వహించి విద్యార్థులలో వందశాతం సామర్థ్యం పెంపొందించేలా కృషి చేయాలని, స్వచ్ఛ పక్వాడ కార్యక్రమాన్ని రోజువారిగా నిర్వహించాలని, అలాగే ఈనెల 15వ తేదీన నేషనల్ డివార్మింగ్‌డేను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఫ్ఎఒ మంజుల, పాఠశాల ఉపాధ్యాయులు వెంకటప్ప, పద్మ, సునిత, ఆంజనేయులు, సలాం, సుజాత ఉన్నారు.

## బాలికల గురుకుల కళాశాలలో బోధన అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

**అచ్చంపేట అర్బన్, సెప్టెంబరు13 ప్రభాతవార్త:** అచ్చంపేట మండలంలోని ఐనోలు గ్రామంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలికల కళాశాలలో బోధించడానికి పార్ట్‌టైం లెక్చరర్ల నియామకం కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వాణి సరళ ఒక ప్రకటనలో తెలిపారు. ఐనోలు గిరిజన గురుకుల పాఠశాలలో ఈ సంవత్సరం నుంచి తెలంగాణ ప్రభుత్వం ఇంటర్ విద్యను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. బోధించడానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 15 వరకు ఐనోలు గిరిజన గురుకుల పాఠశాల/కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు 16న ఐనోలులో గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఉదయం 10గం.లకు డెమోకు హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు. డెమో ఆధారంగా ఎంపిక చేయడం జరుగుతుందని, స్థానిక అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. తెలుగు, ఇంగ్లీష్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, ఫిజికల్ సైన్స్, గణితం బోధించడానికి అర్హత ఉన్న, ఆసక్తి ఉన్న అభ్యర్థులు సకాలంలో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

## ఆరు మాసాల వరకు తల్లిపాలే పట్టాలి

**ఉప్పునుంతల, సెప్టెంబరు 13 ప్రభాతవార్త:** నవజాత శిశువులకు ఆరు మాసాల వరకు తల్లిపాలే పట్టాలని తద్వారా పిల్లలు ఆరోగ్యంగా పెరుగుతారని తల్లి పాలలో ఉన్న పోషకాలు వేటిలోనూ ఉండవని ఐసిడిఎస్ సూపర్ వైజర్ అమృతమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని లత్తిపూర్ గ్రామంలో అంగన్‌వాడి కార్యకర్త జయమ్మ నిర్వహించిన పోషక మాసంలో గ్రామ సర్పంచ్ మల్లేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు పాలు పట్టేటప్పుడు తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రసవం తర్వాత మూడు రోజులపాటు ముర్రుపాలను తప్పకుండా శిశువులకు పట్టించాలని సంపూర్ణ పోషకాలతో ఉండే ముర్రుపాలు శిశువులకు ఎంతో మేలు చేస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేష్‌తో పాటు సూపర్‌వైజర్ అమృతమ్మ, గ్రామ కార్యదర్శి రమేష్, ఉపసర్పంచ్ రమేష్, వార్డు సభ్యులు, గర్భవతులు, తల్లులు పాల్గొన్నారు.



## సిఎం సహాయ నిధి పేదలకు ఎంతో మేలు

- టిఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు నారాయణరెడ్డి



చెక్కును అందజేస్తున్న ఎస్.నారాయన్‌రెడ్డి

**పెద్దేముల్, సెప్టెంబరు 13, ప్రభాతవార్త:** సిఎం సహాయ నిధి పేదలకు ఎంతో మేలని మండల టిఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఎస్.నారాయన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామానికి చెందిన సమీనా భేగం కుటుంబానికి సిఎం సహాయనిధి చెక్కును ఆయన అందజేసారు. ఈ సందర్భంగా ఎస్.నారాయన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసంక్షేమమే ధ్యేయంగా టిఆర్ఎస్ సర్కార్ ముందుకు దూసుకెళుతోందని అన్నారు. సిఎం రిలీఫ్ ఫండ్ నిరుపేద కుటుంబాలకు ఎంతో బాసటగా నిలుస్తోందని అన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటి మాజీ డైరెక్టర్ యాసని బాలప్ప, నాయకులు సయ్యద్ ఇబ్రాహీం, తెరువటి క్రిష్ణ, తాండ్ర సాయులు, చెక్క రాం చెందర్, గిడ్డ రత్నం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి



పాఠశాలలో విద్యార్థులకు దుస్తులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, మాజీ ఎంపిపి పద్మ జగన్‌రెడ్డి

**మేడ్చల్, సెప్టెంబర్ 13. ప్రభాతవార్త ః** విద్యార్థులు కష్టపడి చదివి మంచి ప్రతిభ కనబర్చాలనిగౌడవెల్లి గ్రామ సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, మాజి ఎంపిపి పద్మజగన్‌రెడ్డి అన్నారు.మేడ్చల్ మండలం గౌడవెల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్,మాజి ఎంపిపితో కలిసి మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...విద్యార్థులు చదువులో రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. చదవులో ప్రతిభ కనబర్చి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుదర్శన్‌రెడ్డి, వార్డు సభ్యులు సదానంద్‌గౌడ్, ప్రభాకర్ ముదిరాజ్, గణేష్ యాదవ్, రాజుగౌడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆ ఉపాధ్యాయుడు ప్రతిరోజు ఇంతే

**బషీరాబాద్,సెప్టెంబర్ 13,ప్రభాతవార్త:** ప్రతిరోజు ఉదయం 09 గంటలకు తెరవాల్సిన పాఠశాల ఉపాధ్యాయుని ఇష్టానుసారంగా నడుస్తుంది. బషీరాబాద్ మండల పరిధిలోని మండల పరిషత్ పాఠశాలలు అన్ని ప్రతిరోజు ఉదయం 09 గంటలకు తెరిచి విద్యార్థులకు విద్యబోధన కొనసాగిస్తుంటే,మైల్వార్ తండాలోని మండల పరిషత్ పాఠశాలకు మాత్రం ఉపాధ్యాయుడు ఎప్పుడు వస్తాడో ఎప్పుడు పోతాడో ఎవరికీ తెలియని పరిస్థితి.ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు మంగళవారం నాడు పాఠశాలకు సమయానికి రాకపోవడంతో పాఠశాలకు వచ్చిన విద్యార్థులు పాఠశాల బయట గోలీలు ఆడుతూ కనిపించారు.బాలికలు అరుగుపై ముచ్చటడుతూ కుర్చున్నారు.ఈ విషయంపై విద్యార్థులను ప్రశ్నించగా ప్రతిరోజు ఉపాధ్యాయుడు పాఠశాలకు ఆలస్యంగా వస్తాడని అప్పటి వరకు తాము ఇలాగే ఆడుకుంటామని బదులిచ్చారు. మండల మారుమూల గ్రామాలల్లో,తండాలల్లో ఇలాంటి సంఘటనలు నిత్యం పునవృత్తం అవుతున్న అధికారులు పెద్దగా పట్టించుకోకపోవటంతో ప్రభుత్వ పాఠశాలలు గాడి తప్పుతున్నాయి అనడానికి ఇదే ఉదాహరణ.

## ఆసరా.. నిరుపేదలకు బరోసా

- మున్సిపల్ కౌన్సిలర్ ప్రవీణ్‌గౌడ్



ఆసరా గుర్తింపు కార్డును అందిస్తున్న కౌన్సిలర్ ప్రవీణ్‌గౌడ్.

**తాండూరు, సెప్టెంబరు 13, ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అందిస్తున్న ఆసరా పథకం నిరుపేదలకు ఎంతో బరోసా కల్పిస్తుందని మున్సిపల్ కౌన్సిలర్ ప్రవీణ్‌గౌడ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని 33వ వార్డులో కౌన్సిలర్ ప్రవీణ్‌గౌడ్ నూతనంగా మంజూరైన ఆసరా పింఛన్ గుర్తింపు కార్డులను లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వికలాంగులకు, వృద్దులకు, ఒంటరి మహిళలకు, డయాలసిస్ బాధితలకు ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారని అన్నారు. తాజాగా ఫించన్ అర్హత వయ స్సు ను 65ఏండ్ల నుండి 57 ఏండ్లకు తగ్గించి నిరుపేదల జీవితా లకు బరోసా కల్పించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్పీ ఉమాదేవి, అంగన్‌వాడి టీచర్ రాజేశ్వరీ, వార్డు యువకులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యంతో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు

**కొడంగల్ రూరల్, సెప్టెంబరు, 13 ప్రభాతవార్త;** మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యంతో ఇళ్లలోకి వర్షపు నీరు చేరిందని కాలనీవాసులు లబోదిబోమంటున్నారు. మున్సిపాలిటి పరిధిలోని 2వ వార్డులో ఇళ్లలోని మురుగునీరు వెళ్లేందుకు రోడ్డు మధ్యలో తవ్వి వారం రోజులైనా పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షానికి రోడ్డు మధ్యలో తవ్వి అలాగే వదిలేయడంతో నీరు నిలిచి ఇళ్లలోకి చేరింది. దీంతో మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్ కాలనీవాసుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని జేసీబీ సహాయంతో మరమ్మతులు చేపట్టారు. ఈ విషయంపై కౌన్సిలర్‌తో వివరణ కోరగా ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌కు వివరించినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కాలనీవాసుల ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



2వ వార్డులో డ్రైనేజీ కోసం రోడ్డు మధ్యలో తవ్వి వదిలేసిన దృశ్యం

## బిసి కాలనీ సమస్యలు పరిష్కరించండి

**ఆమనగల్లు, సెప్టెంబర్13, ప్రభాతవార్త:** ఆమగనల్లు పట్టణంలోని బిసి కాలనీలో నెలకొన్న సమస్యలతో ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు వాపోయారు. విచ్చల విడిగా పందులు, శునకాల సంచారం, పేరుకుపోయిన మురుగుకాల్వలు, అపరిశుభ్రంగా వీధులతో నిత్యం ఇబ్బందులు తలెత్తుతున్నాయని కాలనీవాసి కాసోజు విష్ణు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కాలనీకి చెందిన మహిళలు, పురుషులు, యువకులు పెద్ద సంఖ్యలో మున్సిపాలిటీ కార్యలయం ఆవరణలో ఆంధోళన చేపట్టారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా విష్ణు మాట్లాడుతూ బిసి కాలనీ సమస్యలతో సతమతమవుతుందని, అనేక సమస్యలు ప్రజలతో చెలగాట మాడుతున్నాయన్నారు. సమస్యల పరిష్కారానికి మున్సిపాలిటీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రోజురోజుకు మరింత ఉత్పన్నమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కాలనీలో పందుల సంచారం అధికంగా ఉందని, పారిశుద్ధ్య లోపం ప్రజల అనారోగ్యానికి దారి తీస్తుందన్నారు. ఏళ్ళ తరబడిగా పేరుకుపోయిన చెత్తచెదారంతో మురుగుకాల్వలు కంపు కొడుతూ దుర్వాసన వెదజల్లుతుందన్నారు. పాలకవర్గం, అధికారులు పట్టించుకుని బిసి కాలనీలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని విష్ణు కోరారు. ఈమేరకు చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ భీమనపల్లి దుర్గయ్యలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీను, అంజి, యాదయ్య, వసంత, మాలన్, ప్రభావతి, సిహెచ్ మహేశ్, శ్రీను, నిర్మళ, భారతమ్మ, సాలమ్మ, మంజుల తదితరులు పాల్గొన్నారు.



మున్సిపాలిటీ పాలకవర్గంతో మొర పెట్టుకుంటున్న బిసి కాలనీవాసులు

## కెసిఆర్ బండారం బయట పడుతుందనే ఈటల సస్పెన్షన్

- బిజెపి నియోజకవర్గ ఇంఛార్జీ శ్రీవర్ధన్‌రెడ్డి
- బిజెపి ఆధ్వర్యంలో సీఎం కెసిఆర్ దిష్టిబొమ్మ దగ్ధం.



షాద్‌నగర్ ముఖ్యకూడలిలో కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న బీజేపీ నాయకులు.

**షాద్‌నగర్, సెప్టెంబర్ 13, (ప్రభాతవార్త) :** అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి కేసీఆర్ బండారం బయట పడుతుందనే భాయంతోనే బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను అసెంబ్లీ నుంచి సస్పెన్షన్ చేశారని బీజేపీ షాద్‌నగర్ నియోజకవర్గ ఇంఛార్జీ శ్రీవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈటల రాజేందర్‌ను అసెంబ్లీ నుంచి సస్పెన్షన్ చేయడం అమానుషమని, అందుకు నిరసనగా మంగళవారం షాద్‌నగర్ ముఖ్యకూడలిలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా శ్రీవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ... స్పీకర్ టీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తుండటంతోనే ఈటల రాజేందర్ అలా మాట్లాడారని, అందులో తప్పేముందని ఆయన ప్రశ్నించారు. నిండు సభలో సీఎం కేసీఆర్ ప్రధాని నరేంద్ర మోడీని ఫాసిస్ట్ అనలేదా...? ప్రధాని అంతటి స్థాయిగల వ్యక్తిని ఫాసిస్ట్ అంటే తప్పుగా అనిపించలేదా...? దానిపై స్పీకర్ ఎందుకు స్పందించలేదు..? ప్రధానిని ఫాసిస్ట్ అంటే తప్పుగా అనిపించప్పుడు ఈటల స్పీకర్‌ను మరమనిషి అంటే తప్పు ఎలా వచ్చిందని ఆయన ప్రశ్నించారు. కేవలం కేంద్ర ప్రభుత్వాన్ని దూషించటానికి టీఆర్ఎస్ ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లుగా ఉందని, ప్రతి విషయంలోనే కేంద్ర ప్రభుత్వాన్ని తిట్టటానికే అన్నట్లుగా చేస్తున్నారని, కేంద్రంపై చేసే విమర్శలకు బీజేపీ ఎమ్మెల్యేలు వివరణ ఇవ్వటానికి యత్నిస్తే కనీసం సభలో మాట్లాడటానికి కూడా అవకాశం ఇవ్వలేదని, టీఆర్ఎస్ పరిపాలన ఇదేనా... అంటూ ఆయన దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు అందెబాబయ్య, శేరి విష్ణువర్ధన్‌రెడ్డి, చెట్ల వెంకటేష్, వంశీకృష్ణ, బీజేవైఎం ఆశోక్, క్యామ మహేష్, శ్రీనివాస్, గజ్జల ప్రవీణ్, జె.నరసింహులు, హరీష్ ముదిరాజ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సింగారం రక్షిత కౌలుదారుల రిలే నిరాహార దీక్ష

**యాచారం, సెప్టెంబర్ 13 ప్రభాతవార్త** నాలుగు తరాల నుండి సాగు చేస్తున్న రక్షిత కౌలుదారులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మండల పరిధిలోని సింగారం గ్రామ రైతులు చేపట్టిన రిలే నిరహార దీక్ష మంగళవారం రెండవ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా తెలంగాణ రైతు సంఘం , తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం భూసాధన కమిటీ ఆధ ర్యంలో ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి. మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ దూస రమేష్, రాములు, కృష్ణ, రాజిరెడ్డి, జంగయ్య తదితరులకు పూలమాలలు వేసి దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నాలుగు తరాల నుండి సాగు చేస్తున్న రక్షిత కౌలుదారులకు పట్టాలు ఇవ్వకుండా భూ యజమానులు రైతులను మోసం చేసి శిస్తు వసూలు చేయడం, ఓంకారేశ్వర దేవాలయం పేరు పెట్టడం దుర్మార్గమన్నారు. అన్ని రకాలుగా రైతులకు అవకాశం ఉన్నప్పటికీ భూ యజమానుల కుట్ర బుద్దితో రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. 1950లో 37ఎ సర్టిఫికెట్ ఇచ్చారని, వెంటనే 38 ఈ సర్టిఫికెట్ ఇవ్వాలన్నారు. దీనిపై రెవిన్యూ శాఖ మంత్రి, ముఖ్యమంత్రి స్పందించి వెంటనే పట్టాలు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో పట్టాలు ఇచ్చేంత వరకు పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, చిత్తరి సంజీవ, యాదయ్య, చెన్నారెడ్డి, గాలయ్య, పర్వతాలు, వీరప్ప, యాదయ్య, రాజిరెడ్డి, నర్సింహా, రవి, జంగయ్య, లక్ష్మమ్మ, సత్తమ్మ, రాములమ్మ, పోషమ్మ, శేఖర్, మైసయ్య, అంజయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



రక్షిత కౌలుదారుల రిలే నిరహార దీక్షనుద్దేశించి మాట్లాడుతున్న సర్పంచ్ రమేష్

## మహేశ్వరం నియోజకవర్గంలో విషజ్వరాలు...వార్తకు స్పందన



వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

**మహేశ్వరం, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** మహేశ్వరం నియోజకవర్గంలో విషజ్వరాలు అనే వార్తకు స్పందించిన జిల్లా వైద్య శాఖ అధికారులు మహేశ్వరం మండలంలోని ఎన్‌డీ తాండ గ్రామపంచాయతీల్లో ప్రత్యేక వైద్యాధికారులు గిరిజన కాలనీలను సందర్శించి విషజ్వరాలకు గురైన ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. డాక్టర్లు,సిబ్బంద్ది పెద్ద మొత్తంలో హాజరై విషజ్వరాలకు గల కారణాలపై అధ్యాయనం చేశారు. గ్రామపంచాయతీల్లో పరిశుభ్రతకు పరిశుభ్రత మురుగు నీరు, దోమలు వంటి వాటిపైన కూడా దృష్టి కేంద్రీకరించారు. పిల్లలు, పెద్దలు ఈ సీజన్‌లో వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. స్థానికంగా ఆహారం తీసుకోవడం, మందులు వాడడంలో వ్యాధికి గురైన వ్యాధిగ్రస్థులు అప్రమత్తంగా ఉండి వైద్యులను సూచించాలని కోరారు. గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ రమావత్‌ఉర్మిలరవినాయక్ మాట్లాడుతూ.... వైద్యులు తమ గ్రామపంచాయతీని సందర్శించిన విషయంపై తమకు సమాచారం లేదన్నారు. బుధవారం తాండలో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

## శ్రీరామ్‌నగర్ గ్రామంలో కంది పంట పరిశీలన

-రసయాణాలతో పిచికారి చేయాలి : శాస్త్రవేతలు



**మొయినాబాద్ సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చర్ యూనివర్సిటీ తాండూర్ ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మొయినాబాద్ మండలంలోని శ్రీరామ్‌నగర్ గ్రామంలో క్షేత్ర సందర్శన చేయడం జరిగింది, గ్రామంలోని నేరుగా కోంత మంది రైతుల పంట పోలాల వద్దకు వెళ్లి వివిధ పంటలను పరిశీలించారు. కంది పంటను శాస్త్రవేతు పరిశీలించి ఆకుల చుట్టు పురుగు ఉన్నట్లు గుర్తించారు, వెంటనే వారు కంది మొక్కచుట్టు ఉన్న కొనలను తెంపవల్సిందిగా సూచించారు.లేదా పురుగు వదృతి ఎక్కువగా ఉన్నపుడు క్లోరోపైల్ పాస్ 2 ఎమ్ఎల్‌ను పచికారి చేయాల్సిందిగా రైతులకు సూచించారు, అదేవిధంగా అక్కడక్కడ సూక్ష్మ పోషకాల లోపం కనబడుతున్నదని అతోనెక్స్ లేదా ఫార్ములా 4ని పిచికారి చేయాలని సూచించారు. అధిక వర్షాల కారణంగా పత్తి, కందులు అధిక నష్టం వాటిల్లిందని పత్తిలో తామర పురుగులను గమణించారు, అకుపచ్చ తెగుల్లలను గుర్తించారు. తెగుల్ల నివారణకు వెంటనే విప్రోనిల్ 2 ఎం.ఎల్ లేదా ఫ్లోనిక్ అమైడ్ 0.3 గ్రాముల పిచికారి చేయాల్సిందిగా సూచించారు, ఆకుపచ్చ తెగులుకు 1 గ్రాము కార్బెండ్‌జంపోడిని లీటరు నీటిని కలిపి చిచకారిచేయాలని సూచించారు, ఈ కార్యక్రమంలో డాట్ సెంటర్ శాస్త్రవేత డా.ప్రవీణ్ కుమార్, ఎడిఎ రమదేవి, మండల వ్యవసాయ అధికారిణి రాగమ్మ, గ్రామ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి, ఎఈవో కుమార్ మరియు రైతులు పాల్గోన్నారు,

## గణేష్ లడ్డు దక్కించుకున్న మాజీ ఉప సర్పంచ్

-వేలం పాటలో రూ.51116లకు సొంతం

**నందిగామ సెప్టెంబర్13,ప్రభాతవార్త :** నందిగామ మండలంలో గణేష్ నవరాత్రి వేడుకలు నిమజ్జన సంబరాలు అంబరాన్నంటాయి.రంగాపూర్ గ్రామంలో పదకొండు రోజుల పాటు పూజలందుకున్న గణనాథుని నిమజ్జనంలో భాగంగా లడ్డూ వేలం పాట నిర్వహించారు.పోటా పోటిగా సాగిన వేలం పాటలో రంగాపూర్ మాజీ ఉప సర్పంచ్ తోట మహేందర్ రూ51116లకు లడ్డు సొంతం చేసుకున్నారు.గణేష్‌లడ్డూ తమకు దక్కడం అదృష్టంగా భావిస్తున్నామని తోట మహేందర్ కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.



వేలం పాటలో లడ్డు దక్కించుకున్న మాజీ ఉప సర్పంచ్ కుటుంబీకులు

## భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ధనంజయ్‌గౌడ్ ఎన్నిక

**శామీర్‌పేట, సెప్టెంబరు 13, ప్రభాతవార్త** భారతీయ మజ్దూర్ సంఘం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా ప్రధాన కార్యదర్శిగా జి.ధనంజయ్‌గౌడ్ ఎన్నికయ్యారు. మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడకు చెందిన బిఎంఎస్ నాయకులు జి.ధనంజయ్‌గౌడ్‌ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా బిఎంఎస్ నాయకులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బిఎంఎస్ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు రవీంద్రరాజువర్మ, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, సంఘటన కార్యదర్శి రాంమోహన్, జాతీయ నాయకులు ఎ.చెన్నకేశవ, రాష్ట్ర నాయకులు ఎ.రాము, రవిశంకర్, జయేందర్‌లు పాల్గొని జిల్లా నూతన కమిటీని ప్రకటించినట్లు జి.ధనంజయ్‌గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా బిఎంఎస్ నూతన కార్యదర్శి జి.ధనంజయ్‌గౌడ్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అందరికి అందుబాటులో ఉంటూ కార్మికుల శ్రేయస్సు కోసం పనిచేస్తానన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించినందుకు సహకరించిన అందరికి దన్యవాదాలు తెలియజేశారు. జిల్లా అధ్యక్షులుగా ఎ.మల్లేశ్, ఇతర కార్యవర్గంగ జెవిపై బాలేశ్, నర్సింగ్‌రావు, ఉమామహేశ్వర్, రంగనాథ్, రవీందర్, బాలకృష్ణ, రాజేశ్‌గౌడ్, దశరథ, భాగ్యశ్రీ, శ్రీనాథ్‌రెడ్డి, శ్రీనివాస్, అంజనేయులు, వేణు, నాగేశ్, గోవిందలను నియమించారన్నారు.



జిల్లా బిఎంఎస్ జిల్లా కమిటీ కార్యవర్గం ఎన్నికలో పాల్గొన్న బిఎంఎస్ నాయకులు,జగ్గంగూడకు చెందిన జి.ధనంజయ్‌గౌడ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగ ఎన్నికైన దృశ్యం

## ఎంపిడిఓ కార్యాలయ అటెండర్ రాములు గుండెపోటుతో మృతి

-సంతాపం వ్యక్తం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు

**శామీర్‌పేట, సెప్టెంబరు 13, ప్రభాతవార్త** శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న అటెండర్ పంజాగారి రాములు గుండెపోటుతో మంగళవారం ఉదయం మృతిచెందారు. గత మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉన్నాడు. అయితే మంగళవారం ఉదయం ఆయనకు గుండెపోటు రావటంతో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు తెలిపారు. ఆయన 30ఏళ్ల సర్వీస్‌లో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని హైదరాబాద్‌లోని ఇఇ ఆఫీస్‌లో 20ఏళ్లకుపైగా పనిచేసినట్లు, ఆ తరువాత శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో 2012నుంచి అటెండర్‌గా పంజారి రాములు విధులు నిర్వహిస్తున్నారు. అందరితో కలిసిమెలిసి ఉండి అందరి మనసును ఆకట్టుకున్న వ్యక్తిగా గుర్తింపును పొందారు. అటెండర్ రాములు మృతి పట్ల పలువురు తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. శామీర్‌పేట మండల ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, ఎంపిడిఓ జి.వాణి, సూపరిండెంట్ సంపత్‌లు ఆయన నివాసంకు వెళ్లి పార్థీవదేహానికి పూలమాల వేసి ఘనంగ నివాళులు అర్పించారు. సంతాపం తెలిపిన వారిలో ఎంపిటిసిలు కె.అశోక్, అశోక్‌రెడ్డి, ఎ.ఇందిర, ఎస్.ఇందిర, డి.సాయిబాబు,మౌనిక, పలువురు కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది దేవి, బాల్‌రాజ్, యాదమ్మ, రాజమణి పలువురు ఉన్నారు.

## ఓటరు కార్డును ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలి



గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశం

**మేడ్చల్, సెప్టెంబర్ 13. ప్రభాతవార్త ః** మున్సిపాలిటి పరిధిలోని ప్రజల ఓటరు కార్డుకుఆధార్‌కార్డుకు అనుసందానం చేయాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ రాములుఅన్నారు. ఓటరు కార్డుకు ఆధార్‌కార్డు అనుసందానం చేయుట కార్యక్రమంపై గుండ్లపోచంపల్లిమున్సిపల్ కార్యాలయంలో బీఎల్ఓలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఓటరు కార్డును ఆధార్‌తో అనుసందానం చేసుకోవాలని,అందుకు తమ సిబ్బందికి, నిర్వాహకులకు వివరాలు అందించి సహకరించాలని కోరాడు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, సిబ్బంది, బీఎల్ఓటు, ఆర్పీ, అంగన్‌వాడిటీచర్లు తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపోచంపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త అయిన శ్రీనివాస్ రెడ్డి ఈ సమావేశంలో ఏ హోదాతో పాల్గొన్నారని అదే గ్రామానికి చెందిన బిజెపి కౌన్సిలర్ సరస్వతి భర్త మేడ్చల్ నియోజకవర్గం బిజెపి కన్వీనర్ మోహన్ రెడ్డి ఆరోపించారు.ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ...మున్సిపల్ చైర్‌పర్సన్ భర్త పెత్తనం చెలయిస్తూ సమావేశంలో నేరుగా పాల్గొనడం సరికాదని విమర్శించారు.

## శోభాయమానంగా లంబోదరుడి శోభాయాత్ర



నిమజ్జన వేడుకల్లో పాల్గొన్న పోలీస్ అధికారులు

**కొత్తూర్, సెప్టెంబర్ 13, ప్రభాతవార్త :** నవరాత్రి పూజలందుకుని పసందైన ఫలహారాలు అరగించిన బొజ్జ గణపయ్య భక్తులకు ఆశీర్వచనం అందజేసి తిరిగి కైలాసగిరి బాట పట్టారు. కొత్తూర్ మున్సిపాలిటీ పరిధిలో అంబేద్కర్ కాలనీలో ఆల్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి నిమజ్జనం కన్నులపండుగ శోభయాత్ర నిర్వహించారు, ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఇన్స్పెక్టర్ బాల్‌రాజ్, రూరల్ సీఐ సత్యనారాయణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రులు అత్యంత వైభవంగా పూజలు నిర్వహించుకున్న వినాయకుడు యొక్క లడ్డును రూ.20,500లకు కొత్తూర్‌కు చెందిన కొండారెడ్డి సాగర్ కైవసం చేసుకున్నారు. అనంతరం కాలనీలోని చిన్న పెద్ద మహిళలు అందరూ ఆనందత్వహాలతో సంతోషంగా నృత్యాలు చేస్తూ ఘనంగా శోభయాత్ర నిర్వహించారు. ఈకార్యక్రమంలో శివచారి, నరేష్‌గౌడ్, అర్జునయ్యగౌడ్, లక్ష్మయ్య, విష్ణు, బేగ్,సురేష్, యూత్ సభ్యులు మధుసూదన్‌గౌడ్, కొండారెడ్డి సుమన్, పృథ్విగౌడ్,శ్రీను, దీపక్, వంశీగౌడ్, ప్రవీణ్, శివ, సంపత్, సాయి, హనీ, నందు, కాలనీవాసులు తదితరులు ఉన్నారు.

## స్థానికులకే తొలి ప్రాధాన్యత

-జిల్లా నాయిబ్రాహ్మణ సంఘ అధ్యక్షులు



శామీర్‌పేటలో తూంకుంట మున్సిపాల్టీ నాయిబ్రాహ్మణ సంఘంను ఎన్నుకున్న కమిటీ నాయకులు, సభ్యులు

**శామీర్‌పేట, సెప్టెంబరు 13, ప్రభాతవార్త** స్థానికులకే సెలూన్‌షాపుల ఏర్పాటుకు తొలి ప్రాధాన్యత ఇస్తామని మేడ్చల్ జిల్లా నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చిటుకుల సత్యంనాయి తెలిపారు. మంగళవారం శామీర్‌పేటలో సత్యనాయి అధ్యక్షతన తూంకుంట మున్సిపాల్టీ కమిటీ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ కొత్తగా సెలూన్‌షాపులు పెట్టాలనుకున్న వారు స్థానిక, మండల,జిల్లా కమిటీ అనుమతి తీసుకోవాలన్నారు. ఇతరు కులాల వారు సెలూన్‌షాపులు పెట్టాలనుకుంటే జిల్లా కమిటీ అనుమతి పొందాలన్నారు. ప్రతి షాపు మధ్య 300 అడుగుల దూరం తప్పనిసరిగా ఉండాలన్నారు. తూంకుంట మున్సిపాల్టీ నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షులుగా రమేశ్‌నాయి, గౌరవఅధ్యక్షులుగా ఉద్దెమర్రి కృష్ణనాయి, ప్రధాన కార్యదర్శిగా అంజనేయులు, కోశాధికారిగ రాజులను ఏకగ్రీవంగ ఎన్నుకోవటం జరిగినట్లు, మరి కొందరిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## ఎమ్మెల్యే ఈటల సస్పెషన్‌ను ఖండించిన బిజెపి నాయకులు



శామీర్‌పేట ఓఆర్ఆర్ సమీపంలోని బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను శాసనసభ సమావేశంలో సస్పెండ్ చేయటాన్ని ఖండించిన శామీర్‌పేట మండల బిజెపి నాయకులు

**శామీర్‌పేట, సెప్టెంబరు 13, ప్రభాతవార్త** శాసనసభ సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి, హుజారాబాద్ బిజెపి ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను అసెంబ్లీ స్పీకర్ ఆయనను సస్పెండ్ చేయటాన్ని శామీర్‌పేట మండల బిజెపి నాయకులు ఖండించారు. మంగళవారం శామీర్‌పేట ఓఆర్ఆర్ సమీపంలోని ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో మండల బిజెపి నాయకులు కలిసి టిఆర్ఎస్ ప్రభుత్వ తీరును ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. శామీర్‌పేట మండల బిజెపి అధ్యక్షులు కైర యాదగిరి మాట్లాడుతూ ఆరిపోయే దీపానికి,టిఆర్ఎస్ ప్రభుత్వం కనుమరుగు కావటానికి రోజులు సమీపిస్తున్నట్లు ఎద్దేవా చేశారు. శాసనసభా గౌరవాన్ని నిలపకుండ సభ్యుల హక్కులకు విఘాతం కల్గిస్తూ టిఆర్ఎస్ ప్రభుత్వం వ్యవరిస్తుందని ఆయన విమర్శించారు. ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను కలిసిన వారిలో మండల బిజెపి ప్రధాన కార్యదర్శి కె.నర్సింగ్‌రావు, మండల ఉపాధ్యక్షులు ఎస్.లక్ష్మణ్, ఓబిసి మోర్చ జిల్లా కార్యదర్శి పల్లె కుమార్ గౌడ్, జిల్లా బిజెవైఎం ఉపాధ్యక్షులు బోయిని శివ, మండల బిజెవైఎం ప్రధాన కార్యదర్శి రాయి శ్రీకాంత్, మండల నాయకులు జివికె యాదవ్, ఆర్.వి.నారాయణ, భాస్కర్‌రెడ్డి, ఎస్.నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.